MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి :19 సంచిక: 6 రంగారెడ్డి ఫిబ్రవరి 2021 పేజీలు : 36 వెల : రూ. 10/-

## ఏపిమాస్ 20 వసంతాల విజయ ప్రస్థానానికి ఆత్మీయ సత్కారం !




ఢిల్లీలో 'లైవ్లీహుడ్స్ ఇండియా' సమ్మిట్‌లో ఏపిమాస్ వ్యవస్థాపక సి ఇ ఓ , ఎం డి శ్రీ సి ఎస్ రెడ్డిని సన్మానిస్తున్న 'యాక్సెస్' సి ఇ ఓ శ్రీ విపిన్ శర్మ , రాజీవ్ గాంధీ ఫౌండేషన్ సి ఇ ఓ శ్రీ విజయ్ మహాజన్



ఖమ్మంలో శిక్షణపొందిన ఎఫ్ పి ఓల డైరెక్టర్లతో ఏపిమాస్ ప్రతినిధులు



వనపర్తిలో హార్టీకల్చర్ ఎఫ్ పి ఓ డైరెక్టర్లకు శిక్షణ ... పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్రీమతి షేక్ యాస్మిన్ బాషా




కనిగిరిలో ఎస్ ఎల్ ఎఫ్ సమావేశం




ఆదిలాబాద్ జిల్లాలో శ్రీ సి ఎస్ పర్యటన దృశ్యం

NABARD నాబార్డ్ సౌజన్యంతో


नाबार्ड
అభివృద్ధి
కోసం
పారిశుధ్యం
నాబార్డు సౌజన్యంతో
చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి
స్వచ్ఛత ఉద్యమం
బహిరంగంగా బహిర్భూమికి వెళ్ళడం సరికాదు
మీ ఇంటి లోపల మరుగుదొడ్డి నిర్మాణం మంచి పరిష్కారం
गाँव बढ़े >> तो देश बढ़े
www.nabard.org
YouTube /nabardonline
Taking Rural India >>Forward

# మహిళా సాధికారత

సంపుటి 19 సంచిక 5




సంపాదకీయం

## ఇంకెంతకాలం ?

మనది వ్యవసాయ ప్రధాన దేశం. గ్రామాలే దేశానికి జీవనాడిగా పరిగణించే సశాస్త్రీయ సద్భావన. రైతును అన్నదాతగా సంభావించి నెత్తికెత్తుకున్న సంస్కృతి. ఇది ఏనాటి మాటోకాదు నేటిమాటగా కూడా కొనసాగాలనే సంప్రదాయం. కాని, కాలప్రవాహంలో మరెన్నో విలువలు, విశిష్టతలు, వైభవాల మాదిరిగానే ఈ సద్భావన, సంప్రదాయం, సంస్కృతి క్రమేణా కనుమరుగవుతున్నాయి. కొలమానాలు, ప్రమాణాలు క్షణక్షణానికి సరికొత్తరూపును సంతరించుకుంటున్నాయి. జీవన దృశ్యాన్ని వినూత్నకోణంలో కళ్ళముందుంచుతున్నాయి. పాతకు, కొత్తకు కొంత ఘర్షణ సహజం. కాని ప్రతిదానిలో ఎంతో కొంత మంచి, అంతో ఇంతో చెడు వుంటాయన్న వాస్తవం గ్రహించగలిగితే ఘర్షణ సమసిపోతుంది. ఈ క్షణానికి మరుక్షణం కొత్తదనమే ! ఆ నూతనత్వమే లేకుంటే పురోగమన, తిరోగమనాలు లేకుండా 'ఎక్కడవేసిన గొంగడి అక్కడే' అన్నట్టుగా మానవ చరిత్ర స్తంభించిపోయి వుండేది. ఈ కాలజ్ఞానం బోధపడితే సమస్యలను మాత్రమే చూడడం కాకుండా,పరిష్కారాలను అన్వేషించే వివేకం వికసిస్తుంది. ప్రస్తుతం మనదేశంలో వ్యవసాయ సంస్కరణలపేరుతో సాగుతున్న రణం నెలలతరబడి కొనసాగుతుండడం ఈ వివేకోదయం ఇంకా కాలేదనడానికి సంకేతం. అటు ప్రభుత్వము, ఇటు రైతులు భీష్మించుకుని కూచోడం ఎక్కడికి దారితీస్తుందో తెలియడంలేదు. చేసినవారో, చేయించినవారో ఎవరైనా జాతి గౌరవాన్ని కించపరిచే దుస్సంఘటనలు చోటుచేసుకుంటుండడం బాధాకరం. సంస్కరణలు ప్రపంచానికి కాని, మనదేశానికి కాని కొత్తకాదు. ఏదైనా కాలదోషం పట్టినపుడు, వాస్తవిక వర్తమాన పరిస్థితికి, భవిష్యత్ భవ్యప్రస్థానానికి సానుకూలం కానపుడు దానిని సంస్కరించడం సహేతుకమే. కాని ఆ సంస్కరణ మూలాలనే ఛేదించేదిగా వుండడం సరికాదు. భారతప్రభుత్వం తీసుకు వచ్చిన మూడు నూతన వ్యవసాయ శాసనాలు ఇలా మూలచ్ఛేదాలుగా వున్నాయని, అవి ఎంతమాత్రం తమకు ఆమోదయోగ్యం కాదని, మరో మాటకు తావులేకుండా వాటిని ఉపసంహరించుకోవలసిందేనన్నది రైతు నాయకుల వాదన. ఆ మూడు చట్టాలు వ్యవసాయ రంగంలో వినూత్నకాంతులను వెదజల్లుతాయని, రైతుకు బంగారు భవిష్యత్తును అందిస్తాయని, దేశాన్ని సుసంపన్నం చేస్తాయని, వాటిని అమలుజరిపి తీరవలసిందేననేది ప్రభుత్వం పట్టుదల. 2020 సెప్టెంబర్‌లో మూడు బిల్లులను హుటాహుటిన ఆమోదించి, శాసనాలుగా చేసినది మొదలు గత నాలుగు నెలలకు పైగా ఈ ఘర్షణ, ఈ పీటముడి కొనసాగుతున్నాయి. ప్రభుత్వానికి, రైతులకు మధ్య పలు దఫాలు చర్చలు జరిగినా, సుప్రీంకోర్టే స్వయంగా జోక్యం చేసుకున్నా పరిస్థితిలో ఏ మాత్రం మార్పు రాలేదు. పైగా ఉద్యమంలోకి దుష్టశక్తులు ప్రవేశించి గణతంత్ర దినోత్సవంనాటి ట్రాక్టర్ ర్యాలీలో జాతికి తలవంపులు తెచ్చే ఘటనలు చోటుచేసుకున్నాయి. కాలాతీతమైతే ఏ ఉద్యమంలోనైనా ఇలాంటి దుష్పరిణామాలు సంభవిస్తాయి. సరే, ఇది మీ నిర్వాకమంటే, మీ దుస్తంత్రం అని ప్రభుత్వమూ, రైతు సంఘాలు పరస్పరం దూషించుకోవడం సాధారణమే. ఈ పరిణామం రైతు సంఘాలలోకూడా చీలికకు దారితీసి, చివరకు తికాయత్ గారి కన్నీటితో మళ్ళీ ఒక్కటిగా నిలిచినట్టు కనిపిస్తున్నది. అయితే ఇది భావోద్వేగాలతో స్పందించవలసిన అంశం కాదు. ఎంతో వివేకంతో, ముందుచూపుతో విశ్లేషించవలసిన సమస్య. ముందే అనుకున్నట్టు ప్రతిదానిలో మంచీచెడు రెండూ వుంటాయి. ఉభయ పక్షాలు ఈ వాస్తవాన్ని గుర్తించి, మంకుపట్టు మానుకుని హానికరమైన అంశాలేమిటో వాటికి పరిమితమై వాటిని నివారించే కృషి సాగిస్తే చిక్కుముడి వీడుతుంది. తాను రైతుల బంగారు భవిష్యత్తునే కోరుకుంటున్నానని, వారి ఆదాయాన్ని ఇబ్బడి ముబ్బడిగా పెంచడమే ఈ చట్టాల పరమ లక్ష్యమని ఘోషించే ప్రభుత్వంకూడా ఆ రైతులే స్వయంగా ఇవి మాకు చేటు చేస్తాయంటుంటే వినిపించుకోకపోవడం సరికాదు కదా! వ్యాపారమనే మాట మనకు ఎందుకో చెడు మాటగానే వినిపిస్తుంది. వ్యవసాయం, వ్యాపారం అనే పదాలను పక్కపక్కనే చూడడానికి మనకు మనస్కరించదు. కాని ఆ వ్యాపారమే లేకుంటే ప్రపంచానికి ఒక్కరోజు గడుస్తుందా? వ్యవసాయమైనా, వ్యాపారమైనా కావలసింది అంకితభావం, నాణ్యత, నైపుణ్యం, అనుచిత లాభాపేక్షకు తావివ్వని సామాజిక దృక్పథం. ఇవి వుంటే పేరేదైనా, రూపేదైనా అది పవిత్రమే, పరమయోగ్యమే. ప్రపంచం ప్రచండవేగంతో మారుతున్నది. ఆ మార్పును అవగతంచేసుకోలేకపోతే మిగిలేది గతమే, భవిష్యత్తు కాదు. ఉభయ పక్షాలకూ సహేతుక, వాస్తవిక దృక్పథం జతపడి ఈ జటిల సమస్య సులువుగా, శ్రేయోదాయకంగా పరిష్కారమవుతుందని ఆశిద్దాం.


Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:**T.**Chandra Sekhar Reddy**


ఓర్పు ఎంత కష్టమనిపిస్తుందో, దాని వల్ల కలిగే ప్రతిఫలం అంత ఆనందంగా వుంటుంది

# మహిళా సాధికారత


ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. కృష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి, ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు


## లోపలి పేజీలలో ....


- ఏపిమాస్ ద్విదశ వార్షిక విజయ ప్రస్థానం ...05
- రైతుల సమగ్రాభివృద్ధికి చతుర్ముఖ వ్యూహం ! ...06
- నాబార్డ్ రీఫైనాన్స్ పథకాలు.. ...09
- సాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన ...11
- పచ్చిమేత కొరత తీర్చే సైలేజి గడ్డి ! ...12
- మొక్కల ఎదుగుదలకు, సంరక్షణకు దాల్చినచెక్క ...13
- ఎరువుల గోదాములనెలా నిర్వహించుకోవాలి ...14
- జిన్నింగ్ మిల్లు ఏర్పాటుచేసుకున్న ఆదిలాబాద్ ...15
- ధరణి ఎఫ్.పి.ఓ కు శ్రీ సి ఎస్ రెడ్డి పర్యటన ...16
- బాధితులకు బాసట ... ఆకలితీర్చే అన్నపూర్ణ ...18
- మోడల్ పట్టణంగా కనిగిరి నగర పంచాయతీ ...21
- ఇక పంటలు కొనే కేంద్రాలుండవు: నిరంజన్‌రెడ్డి...22
- యాదాద్రి యఫ్‌పిఓ ప్రతినిధుల ధరణి సందర్శన...23
- ఆన్‌లైన్‌లోనే సహకార సంఘాల రిజిస్ట్రేషన్ ! ...25
- వాష్ రిసోర్స్ పర్సన్లకు క్షేత్ర స్థాయి శిక్షణ ...27
- ముఖ వర్చస్సును పెంచే కొబ్బరిపాలు ...28
- 'స్త్రీ నిధి'లో డిపాజిట్లు, రుణ పథకాలు ...29
- విలువ గొలుసు ... జీవనోపాధులు ! ...34



**గమనిక :** 'మహిళా సాధికారత' అనంతమైన భిన్నత్వం నుంచి ఆవహమైన ఏకత్వానికి వేదిక. ఈ పత్రికలో ప్రచురించే రచనలలో వ్యక్తమయ్యే అభిప్రాయాలు పత్రికా నిర్వాహకుల అభిప్రాయాలు కాకపోవచ్చు.


### 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్)

'మహిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశంలోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.


| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**



మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org


నిరంతరం వెలిగే సూర్యుణ్ణి చూసి చీకటి భయపడుతుంది, నిరంతరం శ్రమించే వ్యక్తిని చూసి ఓటమి భయపడుతుంది

# ఏపిమాస్ ద్విదశ వార్షిక విజయప్రస్థానానికి సన్మానం !




*ఏపిమాస్ కేస్ స్టడీల సంకలనం 'అనుభవ్ ' ఆవిష్కరణ దృశ్యం*

**2**021 జనవరి 28-30 తేదీలలో ఢిల్లీలో జరిగిన 'లైవ్లీహుడ్స్ ఇండియా' సమ్మిట్ ఏపిమాస్ 20 వసంతాల విజయ ప్రస్థానానికి ఆత్మీయ అభినందన వేదికగా మారింది. 29 వ తేదీన ఏపిమాస్ టమాట విలువ గొలుసు అభివృద్ధికి సంబంధించి, పంట ఉత్పత్తిలో నవీకరణలు, ప్రాసెసింగ్‌లో నవీకరణలు, మార్కెట్ అనుసంధానాలు అనే రెండు సదస్సులను నిర్వహించింది. తన 20 ఏళ్ళ అభివృద్ధి సేవా రంగ ప్రస్థానంలో తన భాగస్వాములతో కలిసి పనిచేయడంలో పొందిన, ఎదురైన, తోటివారికి అనుభవంలోకి వచ్చిన వివిధ అనుభవాల సారంగా ' అనుభవ్ ' పేరిట ఒక కేస్ స్టడీల సంకలనాన్ని ఏపిమాస్ ప్రచురించింది. ఈ సంకలనాన్ని 'లైవ్లీహుడ్స్ ఇండియా' సమ్మిట్ వేదికగా 30 వ తేదీన ఆవిష్కరించారు.

నాబార్డ్ ఛైర్మన్ శ్రీ జి ఆర్ చింతల ముఖ్య అతిధిగా పాల్గొన్న ఈ సమావేశంలో 'యాక్సెస్' సంస్థ సి ఇ ఓ శ్రీ విపిన్ శర్మ, రాజీవ్ గాంధీ ఫౌండేషన్ సి ఇ ఓ శ్రీ విజయ్ మహాజన్, శ్రీమతి సవితా మహాజన్, శ్రీ శంభుప్రసాద్ సమక్షంలో ఈ సంకలనాన్ని ఆవిష్కరించారు.

అదే వేదికపై ఏపిమాస్ 20 ఏళ్ళ విజయ ప్రస్థానానికి అభినందన సూచకంగా సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డిని శ్రీ విపిన్ శర్మ, శ్రీ విజయ్ మహాజన్ షీల్డ్‌తో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీ విపిన్ శర్మ ఏపిమాస్ ఆవిర్భావానికి పూర్వంనుంచి శ్రీ సి ఎస్ రెడ్డితో తనకుగల సాన్నిహిత్యాన్ని గుర్తుచేసుకుని, ఏపిమాస్ సాధించిన విజయాలను కొనియాడారు.

శ్రీ విజయ్ మహాజన్ తన అభినందన ప్రసంగంలో ఏపిమాస్ (అంధ్రప్రదేశ్ మహిళాభివృద్ధి సొసైటీ) తన విశిష్ట సేవలతో రాష్ట్ర సరిహద్దులను ఎప్పుడో దాటి జాతీయ అంతర్జాతీయ ఖ్యాతి గడించిందని, అందువల్ల ఈ సంస్థ తన పేరును ' ఏబిమాస్ ' (అఖిల భారత మహిళాభివృద్ధి సొసైటీ) గా మార్చుకోవాలని తాను ఎప్పటినుంచో చెబుతున్నానని అన్నారు.

శ్రీ సి ఎస్ రెడ్డి ఏపిమాస్‌కు, తనకు జరిగిన సన్మానానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఈ విజయానికి తోడ్పాటు అందించిన భాగస్వాములందరికి ధన్యవాదాలు తెలిపారు. ■

# రైతుల సమగ్రాభివృద్ధికి చతుర్ముఖ వ్యూహం !

– ఎస్. ప్రహల్లాద

చిన్న, సన్న కారు రైతుల శ్రేయస్సే లక్ష్యంగా ఏపిమాస్ సంస్థ చిత్తూరు జిల్లాలో 14 మండలాలలో (జర్మనీకి చెందిన జిఐజడ్ సంస్థ భాగస్వామ్యంతో 8 మండలాలలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యానశాఖ భాగస్వామ్యంతో 5 మండలాలలో, అరబిందో ఫార్మా భాగస్వామ్యంతో ఒక మండలంలో) రైతులతో కలసి పని చేస్తున్నది. ప్రతి మండలంలోనూ రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ఏర్పాటు చేసి సభ్య రైతుల వ్యవసాయాభివృద్ధికి అనేక రకాల కార్యక్రమాలను అమలు జరుపుతున్నది. ప్రధానంగా రైతులు పండించే కూరగాయల పంటలలో ఖర్చులను తగ్గించుటకు అనేక అవగాహనా సమావేశాలు నిర్వహించడంతో పాటు సభ్యరైతులకు కావలసిన వ్యవసాయ ఉత్పాదకాలు, పనిముట్లు మొదలగు వాటిని సరమైన ధరలకు ఏపిమాస్ అందిస్తున్నది.



ఈ ఎఫ్ పి ఓల సభ్య రైతులలో ఎక్కువమంది వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమపై కూడా ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. అందువల్ల వారికి తోడ్పాటుగా పాడి అభివృద్ధికి ప్రతి ఎఫ్‌పిఓ వివిధ రకాల పశువుల దాణాలను విక్రయిస్తున్నది.

పశుగ్రాస భద్రత కోసం ఏపిమాస్ సంస్థ ప్రయోగాత్మకంగా కురబలకోట, వాల్మీకిపురం మండలాలలో 'పాడి పంటలు' కార్యక్రమం అమలు జరుపుతున్నది. ఈ రెండు మండలాలలో ఈ కార్యక్రమ ఫలితాల ఆధారంగా ఈ కార్యక్రమాన్ని ఇతర మండలాలకు విస్తరించాలని ఏపిమాస్ భావిస్తున్నది.

జిల్లాలో ఇప్పటివరకు అమలు జరిగిన వివిధ రకాల ఏపిమాస్ కార్యక్రమాలను 13.01.2021వ తేదిన సమీక్షించిన సంస్థ ముఖ్య కార్య నిర్వహణ అధికారి శ్రీ సి.ఎస్.రెడ్డి గారు రైతులు ఆశించిన రీతిలో అభివృద్ధి చెందాలంటే వారికి బహుముఖంగా తోడ్పాటందించాలని పేర్కొన్నారు.

ఇప్పటివరకు సభ్య రైతులకు ఎఫ్‌పిఓ లు అందించిన ముఖ్యమైన సేవలు :

1. వివిధ రకాల పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన, చైతన్య కార్యక్రమాలు
2. పొలం బడుల నిర్వహణ ద్వారా రైతులకు నిరంతంగా తోడ్పాటు అందించడం
3. ప్రయోగాత్మకంగా అధిక దిగుబడినిచ్చే టమాట విత్తనాల పరిశీలన
4. ప్రతి ఎఫ్‌పిఓలో దుకాణాలను ఏర్పాటు చేసి రైతులకు కావలసిన ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, పనిముట్లను ఆద్దెకు అందించడం
5. వివిధ రకాల పశువుల దాణాను అందించడం
6. రైతులు పండించే వివిధ రకాల కూరగాయల మార్కెటింగ్‌కు తోడ్పాటు అందించడం



సభ్యులకు అవసరమైన ఆర్ధిక సహాయం అందించేలా ఎపిమాస్ ప్రయత్నిస్తున్నది.

4. **సమగ్ర పశు పోషణ :** చిత్తూరు జిల్లాలో ఉత్పత్తి అయ్యే పాలకు తగిన మార్కెట్ వుండడం వల్ల చాలామంది రైతులు పాడి ఆవుల పెంపకం ద్వారా అదనపు ఆదాయాన్ని గడిస్తున్నారు. మరి కొందరు రైతులకు పాడి ఆవుల పెంపకమే ప్రధాన ఆదాయ వనరు అయింది.

చిత్తూరు జిల్లాలో పశుపోషణలో ఆవుల పెంపకంతో పాటు, గొర్రెల పెంపకం కూడా ముఖ్యం. సభ్య రైతులలో పలువురు గొర్రెలు, మేకలు మొదలగు సన్నజీవాల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. అందువలన సభ్య రైతుల ఆర్ధికాభివృద్ధికి కు పశుపోషణపై కూడా ఎఫ్‌పిఓలు దృష్టి పెట్టాలని శ్రీ సి.ఎస్.రెడ్డి సూచించారు.

**త్రిసభ్య పశువైద్య బృందం**

వ్యవసాయంతో పాటు సమగ్ర పశుపోషణతోనే సభ్య రైతులు అభివృద్ధి చెందుతారని భావించిన శ్రీ సి ఎస్ రెడ్డి పశువైద్యంలో నిపుణులైన, అనుభవం కలిగిన ముగ్గురు పశువైద్యులను నియమించారు. వీరు: డాక్టర్ గోపాల్ రెడ్డి, డాక్టర్ హసన్ సాహెబ్, డాక్టర్ భార్గవి. వీరు ముగ్గురు అవసరాన్నిబట్టి బట్టి గ్రామాలను సందర్శించి సభ్య రైతుల పాడి పశువుల ఆరోగ్య సంరక్షణకు అనేక కార్యక్రమాలను చేపడుతుంటారు.

సమగ్ర పశు అభివృద్ధికి, అధిక పాల దిగుబడికి ఎఫ్‌పిఓలు ఈ క్రింద తెలిపిన కార్యక్రమాలను చేపట్టాలని డాక్టర్ల బృందం సూచించింది.

*అవి ప్రధానంగా :*

1. **దాణా, దాణాలోని ప్రధాన పోషకాలు:** ప్రస్తుతం వివిధ రకాల, వేరు వేరు కంపెనీల పశువుల దాణాను సభ్య రైతులు కొనుగోలు చేస్తున్నారు. అయితే, దాణాను కొనే

**చతుర్ముఖ వ్యూహం**

సభ్య రైతుల సర్వతోముఖాభి వృద్ధికి ఎఫ్‌పిఓ లు చతుర్ముఖ వ్యూహం రచించి ముందుకు సాగాలని శ్రీ సి.ఎస్.రెడ్డి వివరించారు.

1. **రైతుకు కావలసిన ఉత్పాదకాల కల్పన:** ఇప్పటికే ఎఫ్‌పిఓలు ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. రైతులకు మరిన్ని సేవలు అందించుటకు ప్రణాళికలు సిద్ధం చేశాయి.

2. **వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పన** : ప్రధాన నగరాలలోని ప్రముఖ వ్యాపార సంస్థలలో ఒప్పందాలు చేసుకొని ఎఫ్‌పిఓలు తమ సభ్య రైతులు పండించే కూరగాయలకు మార్కెటింగ్ సౌకర్యం కలిగించుచున్నవి. అంతేగాక ప్రస్తుతము 5 ఎఫ్‌పిఓల లోని కూరగాయల రవాణా వాహనాలను ఉపయోగించి సభ్య రైతులు పండించిన కూరగాయలను మార్కెట్‌లకు చేర్చుటకు తక్కువ బాడుగతో రైతులకు సేవలు అందించుచున్నారు.

3. **పెట్టుబడి :** రైతులకు కావలసిన పెట్టు బడిని ఇప్పటికే బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు అందిస్తున్నాయి. కాని రైతుల అవసరాలకు ఇవి సరిపోవడం లేదు. అందువలన 'సమున్నతి' మొదలగు జాతీయ ఆర్ధిక సంస్థలతో ఒప్పందాలు చేసుకొని ఎఫ్‌పిఓ లు తమ

మానవ జన్మ ప్రకృతిని జయించడానికే కాని, దానిని అనుసరించడానికో, అనుకరించడానికో కాదు

ముందు ఆ దాణాలోని ప్రొటీన్ శాతాన్ని గమనించి కొనుగోలుచేయాలని శ్రీ సి ఎస్ రెడ్డి సూచించారు. ప్రొటీన్ శాతం 18% వున్న దాణాను కొనుగోలు చేసినట్లయితే పశువుల ఆరోగ్యం బాగుంటుందని డాక్టర్ భార్గవి తెలిపారు.

2. **మినరల్ మిక్స్చర్ :** ఈ మిక్స్చర్ చూడి ఆవులకు, ఈనిన ఆవులకు బాగా పని చేస్తుందని ఆమె తెలిపారు
3. **మినరల్ బ్రిక్స్:** ఆవులతో పాటు గొర్రెలు మొదలైన చిన్న జీవాలను కూడా సభ్య రైతులు ఎక్కువగా పెంచుకుంటున్నందున వాటి అభివృద్ధికి మినరల్ మిక్స్చర్ ఎక్కువగా ఉపయోగపడుతుంది.
4. **లివర్ టానిక్స్ :** ఇది గొర్రెలకు బాగా పనిచేస్తుంది. మేత సరిగా తిననపుడు ఈ టానిక్ గొర్రెలకు తాపిస్తే, మేత బాగా మేస్తాయి.
5. **డీ వార్మింగ్ :** పశువుల కడుపులో పురుగులు వున్నట్లయితే ఆహారం సరిగా తినవు. అందువలన డీ-వార్మింగ్ చేయిస్తే పశువుల కడుపులోని పురుగులు చనిపోతాయి. ఫలితంగా పశువులు బాగా మేత తిని ఆరోగ్యంగా వుంటాయి
6. **కాల్షియమ్ :** పశువులలో బలం పెంపుదల కోసం ఇవి బాగా పనిచేస్తాయి
7. **విటమిన్ కలిగిన పదార్థాలు :** పశువులలో బలం పెంపుదల కోసం మరియు అధిక పాల దిగుబడికి ఇవి బాగా పని చేస్తాయి
8. **మేలురకం పశుగ్రాసాల పెంపకం:** వివిధ రకాల పశు గ్రాసాల పెంపకాన్ని చేపట్టే విధంగా రైతులను ప్రోత్సహించాలి. అధిక దిగుబడి వంగడాలతో పాటు ఆవిశ మొదలగు వంగడాలను పెంచుకునే విధంగా ఎఫ్‌పిఓలు చర్యలు చేపట్టాలి. పశుగ్రాసం వంగడాలను పెంచే విధంగా నర్సరీలను ప్రోత్సహించాలని తెలిపారు. ప్రస్తుతం ఏపిమాస్ కురబలకోట, వాల్మీకిపురం మండలాలలో పశుగ్రాస భద్రతకోసం అమలు పరిచే 'పాడి పంటల కార్యక్రమాన్ని' మిగిలిన మండలాలకు కూడా విస్తరించాలని శ్రీ సి.ఎస్.రెడ్డి కోరారు. ■

## చిరుధాన్యాలలో పోషక పదార్థాలు (ప్రతి 100 గ్రాములకు)

| | మాంసకృత్తులు (గ్రా) | పిండిపదార్థాలు (గ్రా) | కొవ్వులు (గ్రా) | మినరల్స్ (గ్రా) | పీచుపదార్థం (గ్రా) | కాల్షియం (మి.గ్రా) | ఫాస్ఫరస్ (మి.గ్రా) | ఐరన్ (మి.గ్రా) | శక్తి (మి.గ్రా) |
|---|---|---|---|---|---|---|---|---|---|
| రాగి | 7.3 | 72 | 1.3 | 2.7 | 3.6 | 344 | 283 | 3.9 | 336 |
| జొన్న | 10.4 | 70.7 | 3.1 | 1.2 | 2.0 | 25 | 222 | 5.4 | 329 |
| సజ్జ | 11.8 | 67.0 | 4.8 | 2.2 | 2.3 | 42 | -- | 11.0 | 363 |
| కొర్ర | 12.3 | 60.2 | 4.3 | 4.0 | 6.7 | 31 | 290 | 2.8 | 351 |
| సామలు | 7.7 | 67.0 | 4.7 | 1.7 | 7.6 | 17 | 220 | 9.3 | 329 |
| అరికలు | 8.3 | 65.9 | 1.4 | 2.6 | 5.2 | 35 | 188 | 1.7 | 353 |
| వరిగలు | 12.5 | 70.4 | 1.1 | 1.9 | 5.2 | 8 | 206 | 2.9 | 354 |
| ఊదలు | 6.2 | 65.5 | 4.8 | 3.7 | 13.6 | 22 | 280 | 18.6 | 300 |
| ---------- | ---------- | ---------- | ---------- | ---------- | ---------- | ---------- | ---------- | వరి | 6.8 |
| 78.2 | 0.5 | 0.8 | 1.0 | 33 | 160 | 1.8 | 362 | | |
| గోధుమ | 11.8 | 7.12 | 1.5 | 1.5 | 2.0 | 30 | 306 | 3.5 | 348 |

# నాబార్డ్ రీఫైనాన్స్ పథకాలు

**1.** షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, సహకార బ్యాంకులు, చిన్న పరపతి బ్యాంకులకు, బ్యాంకింగ్ రంగానికి చెందని ఎంపిక చేసిన ఆర్థికసంస్థలకు కూడా నాబార్డ్ 'రీఫైనాన్స్' సదుపాయం కల్పిస్తున్నది. ముఖ్యంగా రెండు రకాల రీఫైనాన్స్ పథకాలను నాబార్డ్ ఆమలుచేస్తున్నది. అవి: పంట కాలంలో వ్యవసాయ పనులకు, ఇతర కార్యక్రమాలకు అందించే స్వల్పకాలిక (ఎస్ టి) రీఫైనాన్స్ పథకం (షార్ట్ టర్మ్ సీజనల్), వ్యవసాయ, అనుబంధ, ఇతర అవసరాలకు అందించే మధ్యకాలిక (ఎం టి), దీర్ఘకాలిక (ఎల్ టి) రీఫైనాన్స్ పథకం.

2. నాబార్డ్ 2020 ఏప్రిల్‌లో బ్యాంకులకు ప్రత్యేక లిక్విడిటి పథకాన్ని (ఆస్తులను సులువుగా నగదుగా మార్చుకునే పథకం) ప్రకటించింది. ఈ పథకంకింద తెలంగాణా గ్రామీణబ్యాంక్, ఏపి గ్రామీణవికాస్‌బ్యాంక్, తెలంగాణా ఎస్‌టి సి బిలకు రాయితీపై రీఫైనాన్స్ సమకూర్చడం జరిగింది. ఈ రుణ సదుపాయం ప్రధాన లబ్ధిదారులు స్వయంసహాయ సంఘాలు (ఎస్‌హెచ్‌జి లు), ఉమ్మడి జవాబుదారీ సంఘాలు (జె ఎల్ జి లు), రైతులు మొదలైనవారు. కోవిడ్-19 కారణంగా రుణాల అందుబాటుకు ఏర్పడిన ఆంతరాల సమస్యకు పరిష్కారంగా బ్యాంకింగ్ రంగానికి చెందని ఆర్థిక సంస్థలకు (ఎన్ బి ఎఫ్ సి) / ఎన్ బి ఎఫ్ సి- ఎం ఎఫ్ ఐ లకోసం 2020 అక్టోబర్‌లో ఆదనపు ప్రత్యేక లిక్విడిటి సదుపాయాన్ని కూడా నాబార్డ్ కల్పించింది. ఈ సదుపాయం కింద రెపో+300 బేసిస్ పాయింట్ల ప్రకారం నాబార్డ్ నిధులు సమకూరుస్తుంది.

3. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను (పాక్స్ లను) 'వివిధ సేవల కేంద్రాలు'గా (ఎం ఎస్ సి లుగా) మార్పు చెందించడానికి వీలుగా 2020 జులైలో నాబార్డ్ ఒక ప్రత్యేక రీ ఫైనాన్స్ పథకాన్ని ప్రకటించింది. సభ్యుల రుణ, తదితర అవసరాలను తీర్చడం, ఒకేచోట వివిధ సేవలను అందించే సంస్థలుగా వ్యాపారాలను వైవిధ్యభరిత వ్యాపారాలుగా మార్చుకోవడానికి వీలు కల్పించడం, 2020-2021తో మొదలుపెట్టి సమర్థమైన పాక్స్‌లను మూడేళ్ళలో పూర్తిస్థాయి ఎం ఎస్ సి లుగా తీర్చిదిద్దడం ఈ పథకం ఆశయం.

ఈ పథకం కింద తెలంగాణా ఎస్‌టి సి బి కి 3% వడ్డీకి నాబార్డ్ దీర్ఘకాలిక రీఫైనాన్స్ సమకూర్చింది. చివరకు రుణ గ్రహీతకు (పాక్స్‌కు) కేవలం 4% వడ్డీకే ఈ రుణం లభిస్తుంది. ఈ రుణం మంజూరైన తర్వాత అవసరాన్నిబట్టి రుణ మొత్తంలో 10% మించకుండా (గరిష్ఠంగా 2 లక్షల రూపాయలు) సాంకేతిక పరిజ్ఞానం / నిర్వహణ పరమైన తోడ్పాటు/ సామర్థ్య నిర్మాణం / బ్రాండ్ ప్రమోషన్, మార్కెట్ ప్రమోషన్ కార్యకలాపాలకోసం గ్రాంట్ సదుపాయాన్ని పాక్స్ కోరవచ్చు. ఈ పథకంకింద రీఫైనాన్స్ కాలపరిమితి గరిష్ఠంగా 7 సంవత్సరాలు. 6-24 నెలల గ్రేస్ పిరియడ్ (పొడిగింపు) వుంటుంది. పాక్స్‌లను ఎం ఎస్ సి లుగా తీర్చిదిద్దే పథకం కింద రాయితీతో కూడిన రీఫైనాన్స్ పొందిన పాక్స్‌కు భారత ప్రభుత్వ వ్యవసాయ ప్రాథమిక వనరుల నిధి (ఏ ఐ ఎఫ్) నుంచి గ్రాంట్ (సబ్‌వెన్షన్) కోసం దరఖాస్తు చేసుకునే అర్హతకూడా వుంటుంది. భారత ప్రభుత్వం నిర్దేశించిన కార్యకలాపాల నిర్వహణకు 3% సబ్‌వెన్షన్ పొందడానికి ఈ పాక్స్‌లు అర్హమైనవవుతాయి. ఏ ఐ ఎఫ్ కింద ఈ కింద పేర్కొన్న ప్రాథమిక జాబితాలోని కార్యకలాపాలకు సబ్‌వెన్షన్ సదుపాయం లభిస్తుంది:

- ఇ మార్కెటింగ్ ప్లాట్‌ఫామ్స్‌తో సహా సరఫరా గొలుసు సేవలు, గోదాములు, సిలోలు, శీతలీకరణ నిర్మాణాలు
- పాక్ హౌస్‌లు, మదింపు (అస్సేయింగ్) యూనిట్లు
- సార్టింగ్, గ్రేడింగ్ యూనిట్లు , లాజిస్టిక్ సదుపాయాలు

ఏ పరిస్థితులలో వున్నా నీ కర్తవ్యం నీకు గుర్తుంటే జరగవలసిన పనులు అవే జరిగి పోతాయి

- ప్రాథమిక ప్రాసెసింగ్ కేంద్రాలు
- రైపెనింగ్ ఛేంబర్స్, భూసార పరీక్షా కేంద్రాలు
- స్మార్ట్ , ప్రెసిషన్ వ్యవసాయానికి ప్రాథమిక వనరులు
- మైక్రో నీటిపారుదల
- సేంద్రియ ఎరువుల ఉత్పత్తి

4. నాబార్డ్ ఇటీవల ప్రకటించిన ప్రత్యేక రీఫైనాన్స్ పథకాలలో సంస్థాగత రుణసదుపాయాన్ని పెంపొందించడం కోసం వాటర్షెడ్, వాడి ప్రాజెక్ట్‌లకు రుణసహాయం అందించేవి కూడా వున్నాయి. నాబార్డ్ వాటర్‌షెడ్, వాడి ప్రాజెక్ట్‌ల ద్వారా అంతిమంగా చిన్న / సన్న తరహా రైతులకు, గిరిజన రైతులకు, ఎఫ్ పి ఓ లకు, ఎస్‌హెచ్‌జిలకు,జెఎల్‌జి లకు లబ్ధి చేకూరుతుంది. ఈ పథకం కింద నాబార్డ్ నుంచి బ్యాంకులకు ఏడాదికి 3% వడ్డీకి, తిరిగి చెల్లింపునకు 5 సంవత్సరాల గరిష్ఠ కాలపరిమితితో రీఫైనాన్స్ అందుతుంది. దానిపైన 2.5% మించని వడ్డీతో బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తుది లబ్ధిదారులకు అప్పు సమకూర్చవలసి వుంటుంది.



*గోదాము ... మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్*

5. మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ కార్యకలాపాలను ప్రోత్సహించడం కోసం మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి ప్రత్యేక రీఫైనాన్స్ పథకాన్ని నాబార్డ్ ప్రవేశపెట్టింది. బ్యాంకులు ఈ పథకంకింద వ్యక్తులకు,ఎఫ్‌పిఓ లకు , ఎస్ హెచ్ జి లకు, జె ఎల్ జి లకు, యాజమాన్య / భాగస్వామ్య సంస్థలకు, కంపెనీలు మొదలైనవాటికి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ సంబంధిత కార్యకలాపాలకు నాబార్డ్ సమకూర్చే రీఫైనాన్స్‌తో రుణాలు అందిస్తాయి. గ్రామీణ ప్రాంతాలలో ప్రస్తుతం నిర్వహిస్తున్న చిరు వ్యాపారసంస్థలను (మైక్రో ఎంటర్‌ప్రైజెస్) ఆధునీకరించి, అవి మార్కెట్లో పోటీపడగలిగే సామర్థ్యాన్ని పెంపొందించి వ్యవస్థీకృత రంగంలోకి ప్రవేశించేలా చూడడమే ఈ పథకం ఆశయం. ఏదైనా మైక్రో ఎంటర్‌ప్రైజ్‌ను ఏర్పాటుచేయడానికి ఒక లక్ష నుంచి గరిష్ఠంగా 25 లక్షల రూపాయల వరకు రుణం సమకూరుతుంది. చిరు ఆహార ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, పంటకోత తర్వాత నిర్వహించే కార్య కలాపాలు / శుభ్రం చేయడం, గ్రేడింగ్, వాక్సింగ్, ప్యాకింగ్, గుజ్జు, జ్యూస్‌ల తయారీ, ఊరగాయలు, స్క్వాష్‌లు, సాస్‌లు, పిండి మరపట్టడం, నూడుల్స్, తేనె, చిప్స్ తయారీ, సుగంధ ద్రవ్యాలను మరపట్టడం మొదలైన ప్రాథమిక ఉత్పత్తుల విలువ పెంపు కార్యకలాపాలను నిర్వహించే వ్యక్తులు, ఎఫ్ పి ఓ లు, ఎస్ హెచ్ జి లు, జె ఎల్ జి లు, రైతు సమూహాలు, యాజమాన్య సంస్థలు, భాగస్వామ్య సంస్థలు, కంపెనీలు మొదలైనవి ఈ పథకంకింద రుణం పొందడానికి అర్హత కలిగిన వుంటాయి.

6. సంక్రమణ వ్యాధులు ముఖ్యంగా ప్రస్తుత కోవిడ్-19 మహమ్మారివంటి వ్యాధులు విజృంభించే పరిస్థితులలో, మనుషుల ఆరోగ్యాన్ని కాపాడడానికి సురక్షితజలాలు, పారిశుధ్యం, పరిశుభ్రత అత్యవసరం.అందువల్ల నీరు,పారిశుధ్యం, పరిశుభ్రతకు సంబంధించిన కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందించే అర్హత కలిగిన ఆర్థిక సంస్థలకు నాబార్డ్ ప్రత్యేక రీఫైనాన్స్ సదుపాయం కల్పిస్తున్నది. ఈ కోవిడ్-19 కాలంలో నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత కార్యక్రమాలను పటిష్టపరచడం ఈ పథకం ఆశయం. ఈ పథకం కింద ఇంకా ఇంటిలో మరుగుదొడ్డి నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణం లేదా పునరుద్ధరణ, చేతులు కడుగుకునే సదుపాయాన్ని ఏర్పాటుచేయడం లేదా జోడించడం, ఇంట్లో నీటి మోటారు పంపు / బోరుబావి / గొట్టపుబావి / నీటి కనెక్షన్లు / పైప్ లైన్లు, నీటి నిల్వ సదుపాయాలు, ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు, వాన నీటి నిల్వ నిర్మాణాలు, నీటిని వడకట్టే / శుభ్రపరచే ఏర్పాట్ల వంటి ఇతర కార్యక్రమాలను చేపట్టవచ్చు. ■

# సాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన

- శ్రీనివాస్ ... ప్రాజెక్ట్ ఆఫీసర్

**అ**రబిందో సంస్థ ఆర్థిక సహకారంతో మహిళా అభివృద్ధి సొసైటి ఆధ్వర్యంలో జై కిసాన్ రాయితీ సంఘ సభ్యులకు వ్యవసాయశాఖ, ఉద్యానవనశాఖ వారి భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమం రెడ్డిఖానాపూర్ గ్రామంలో ఏర్పాటు చేయటం జరిగింది. ఉద్యానవన శాఖ అధికారిణి కీర్తికుమారి మాట్లాడుతూ, కూరగాయల సాగుద్వారా ఎక్కువ లాభాలను సంపాదించవచ్చునని, రోజువారీ ఆదాయం కనిపిస్తుందని తెలిపారు. రైతులు సాంకేతిక పరిజ్ఞాన్ని అలవాటు చేసు కోవాలని, కూరగాయల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, సబ్సిడి లభించే పథకాలు ఎన్నో ఉన్నాయని, వాటిలో మల్చింగ్ విధానం ఒకటని, దానికి 50% సబ్సిడి వస్తుందని ఆమె వివరించారు. ప్రతి రైతు పంట మార్పిడి విధానాన్ని పాటించాలని 5 ఎకరాలలోపు ఉన్న రైతులు వర్షాకాలంలో వరిపంట, రబీలో వరి పంట కాకుండా కూరగాయలు సాగు చేస్తే అధిక లాభాలు సంపాదించవచ్చునని చెప్పారు.

పురుగు మందులను ఎంత తక్కువగా వాడితే అంత మంచిదని , పురుగు మందులు అమ్మేవారు కోటీశ్వరులు అవుతున్నారుకానీ రైతు మాత్రం కావటం లేదన్నారు.

| తోటరకం | జిల్లా లక్ష్యం | మొక్కల సంఖ్య | మొదటి సం | రెండవ సం | మూడవ సం | మొత్తం |
|---|---|---|---|---|---|---|
| టిష్యూకల్చర్ | 30 హె | 3086 | 30739 | 10246 | 0 | 40985 |
| బొప్పాయి | 15 హె | 3086 | 22500 | 7500 | 0 | 30000 |
| మామిడి | 15 హె | 833 | 17396 | 5799 | 5799 | 28994 |
| జామ | 10 హె | 1111 | 17599 | 5866 | 5866 | 29332 |

వ్యవసాయ శాఖ అధికారి ప్రేమరాజ్ మాట్లాడుతూ రబీ సాగులో తీసుకోవల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

- ప్రతి రైతు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి
- నాణ్యమైన, విత్తన శుద్ధి చేసిన వరి విత్తనాలను విత్తుకోవాలి.
- నేలకు 10 అంగుళాల ఎత్తుతో నారు మడి చేసుకోవాలి
- 25 గ్రాముల కార్బండిజంను 25 లీటర్ల నీటిలో కలపాలి
- సింగిల్ సూపర్ ఫాస్పెట్ వాడాలి
- జీవన ఎరువులు తప్పనిసరిగా వాడాలి
- రాత్రి పూట నీరు ఉంచి ఉదయం పూట తీసివేయాలి



- ముదిరిన నారు చిగుర్లను కత్తిరించాలి
- కర్రకు కర్రకు 20 సెంమీ దూరాన్ని పాటించి నాటాలి
- నాట్ల తర్వాత 1 బస్తా డిఏపి, 1 బస్తా యూరియా వేయాలి
- ఎరువులు ఎంత తక్కువగా వాడితే అంత ఆరోగ్యాన్ని కాపాడినవారు అవుతారు
- పిలకలు పెరగాలంటే వరిలో నీరు తక్కువగా ఉండాలి
- పొలం పొడిగా ఉంచాలి

| కూరగాయ రకం | ఎకరానికి మొక్కలు | మొత్తం ఖర్చు | పొందే రాయితీ | రైతుకయ్యే ఖర్చు రూ |
|---|---|---|---|---|
| టమోటా | 8000 | 8000 | 6500 | 1500 |
| వంకాయ | 8000 | 8000 | 6500 | 1500 |
| మిరప | 6400 | 8000 | 6720 | 1280 |

■

# పచ్చిమేత కొరత తీర్చే సైలేజి గడ్డి !

–లిఖితా శ్రీరాం

పచ్చిమేత లేకుండా పాడి లాభసాటి కాదు. అయితే సంవత్సరం పొడవునా మనకు పచ్చిమేత లభ్యం కాదు. మే, జూన్ నెలల్లో పచ్చిమేత కొరత మరీ ఎక్కువ. అందువల్ల జనవరి నెలలోనే పాతర గడ్డి లేదా సైలేజీ గడ్డి లేదా మాగుడు గడ్డిని తయారుచేసుకుని పచ్చి గడ్డి కొరత వుండే నెలల్లో వాడుకుంటే పాల దిగుబడి తగ్గిపోకుండా ఉంటుంది.

**'సైలేజి' తయారు చేయడం**

- పచ్చిగా ఉండే పశుగ్రాసాన్ని ముక్కలుగా చేసి, గాలి లేకుండా పులియబెట్టి, నీరు కూడా లేకుండా ఉండే స్థితిలో నిలువ చేయడాన్ని 'సైలేజి' అని అంటారు. ఆక్సిజన్ కూడా లేని పరిస్థితిలో నిలువ చేయడం వల్ల, పశుగ్రాసంలోని నీటిలో కరిగే పిండి పదార్థాలన్నీ, ఆర్గానిక్ ఆమ్లాలుగా మారి, గ్రాసం ఆమ్ల పరిమాణాన్ని పెంచుతాయి
- ఈ పరిస్థితులలో బాక్టీరియా, శిలీంధ్రాలు పెరగలేవు. దీనివల్ల పోషకాహార నష్టం జరగకుండా నాణ్యత పెరుగుతుంది. పశువులు దీనిని చాలా ఇష్టంగా తింటాయి. బాగా అరిగించుకుంటాయి
- సైలేజీ నాణ్యత గడ్డిలోని ఎండు పదార్థం, కరిగించబడే తీపి పదార్థాలపై ఆధారపడి ఉంటుంది. అలాగే ముడి మాంసకృత్తులకు తీపి పదార్థాల నిష్పత్తి కూడా చాలా ప్రభావాన్ని చూపిస్తుంది. పంటను 50 శాతం పూతదశలో కోసినపుడు, లేదా పాలదశలో కోసినపుడు తయారు చేసే 'సైలేజి' మంచి నాణ్యతను కలిగి ఉంటుంది
- మొక్కజొన్న, జొన్న, సజ్జ, మొదలగు పంటలను 50% పూత దశలో కోని సైలేజీకి ఉపయోగించాలి. నేపియర్ గడ్డి అయితే 45–50 రోజుల వ్యవధిలో, ఇతర గడ్డిని కూడా పూత దశలో కోసి సైలేజీకి ఉపయోగించాలి
- నీటి ఊటలేని ఎత్తైన ప్రదేశంలో పాతర తవ్వి దాని అడుగు భాగాన, పక్కలకు సిమెంటు గోడలు కట్టాలి. చాఫ్ కట్టర్‌తో సన్నగా నరికిన మేతను పాతరలో నింపి, ట్రాక్టరుతో నడిపి పాతరలో గాలి లేకుండా చేయాలి. ప్రతి టన్ను గడ్డికి 2–3 కిలోల బెల్లపు మడ్డి, 2 కిలోల రాతి ఉప్పు పొరల మధ్య చల్లాలి
- పాతరను భూమికి 2–3 అడుగుల ఎత్తు వరకు నింపి, దానిపై మందపాటి పాలిథీన్ షీట్ లేదా వరిగడ్డిని



పరచి మట్టి, పేడ మిశ్రమంతో పూత పూసి (అలికి) ఏ మాత్రం గాలి, వర్షపు నీరు పాతరలోకి పోకుండా జాగ్రత్త పడాలి. గోతులను నింపే ముందు గోతుల అడుగు భాగాన, పక్కలకు వరిగడ్డి వేస్తే పాతర గడ్డి వృథాకాకుండా ఉంటుంది.
- లేకుంటే గాలి, నీరు సోకిన పాతరగడ్డి బూజుపట్టి చెడిపోతుంది. ఇలా నిలువ చేసిన గడ్డి త్వరగా రసాయనిక మార్పుకు గురవుతుంది. మంచి గడ్డి లేత పసుపు పచ్చ రంగులో మగ్గిన పండ్ల సువాసనతో తేమను కలిగి ఉంటుంది. చెడిపోయిన మాగుడు గడ్డి ముదురు గోధుమ రంగు లేదా నలుపు రంగుతో పులుపు వాసన కలిగి ఉంటుంది

**సైలేజీ గడ్డి తయారీలో జాగ్రత్తలు**

- పశుగ్రాసాన్ని నింపేటప్పుడు గుంతలో గాలి చొరబడకుండా చూడాలి
- గుంతలో నీరు లేకుండా, చేరకుండా చూడాలి
- సైలేజీ తయారీకి ఉపయోగించే పశుగ్రాసాల్లో 65 శాతం కంటే ఎక్కువ తేమ ఉండకూడదు
- జొన్న, మొక్కజొన్న చొప్ప సైలేజీ గడ్డి తయారీకి చాలా అనుకూలం. సైలేజీ గుంతను 3-4 రోజుల వ్యవధి లోపలే నింపాలి. అంతకన్నా ఆలస్యం కాకూడదు
- జొన్న, మొక్కజొన్న, నేపియర్ గడ్డి రకాలు వాడినట్లయితే 1 టన్నుకు 3 కిలోల యూరియా కలిపితే మంచిది
- గుంత పై భాగాన్ని 2-3 అడుగుల ఎత్తు వరకు డోములాగా నింపవచ్చు
- సైలేజీ నింపిన తర్వాత 2-3 అంగుళాల వరకు మట్టితో కప్పినట్లయితే ఆ వత్తిడి వల్ల గుంతలో మిగిలిన గాలి బయటకు వెళ్లిపోయే అవకాశం ఉంటుంది
- 2-3 నెలల వ్యవధిలో సైలేజీ తయారవుతుంది
- 2-3 సంవత్సరాల వరకు నిల్వ చేసుకోవచ్చు
- గుంత తెరచిన తర్వాత సైలేజీని ఒక నెల లోపల వాడాలి. లేదంటే బూజు పడుతుంది.
- బూజు పట్టిన సైలేజీ గడ్డిని పశువులకు మేపకూడదు

రోజూ పశువుకు 20 కిలోల సైలేజీతోపాటు పచ్చి మేత ఒక భాగం, ఎండుమేత ఒక భాగం కలిపి మేపితే మేలు. ప్రాణ వాయువు లేకుండా బ్యాక్టీరియా కారణంగా జరిగే రసాయనిక చర్య ద్వారా సైలేజీగడ్డి తయారీలో సువాసనలతో కూడిన ఆమ్లాలు ఉత్పత్తవుతాయి. అందుకే సైలేజీ గడ్డిని పశువులు ఇష్టంగా తింటాయి. ■

## మొక్కల ఎదుగుదలకు, సంరక్షణకు దాల్చినచెక్క !

**దా**ల్చినచెక్క మొక్కలకు ఎరువుగానూ, తెగుళ్ళు, చీడల నుంచి సంరక్షణకారిగాను ఉపయోగపడుతుంది.

- తోటలో చీమల బెడద ఎక్కువగా ఉంటుంది. ఇవి చెట్ల ఆకులను తినేస్తాయి. దీంతో మొక్కల ఎదుగుదల దెబ్బతింటుంది. చీమలు గుంపులుగా మొక్కలను చుట్టబెడతాయి. దీంతో మొక్కలు ఎదగకుండా నశించిపోతాయి. చీమలకు దాల్చినచెక్క వాసన పడదు. దీని ఘాటుకు చీమలు ఉక్కిరిబిక్కిరి అవుతాయి. దీంతో మొక్కలకు చీమలవల్ల హాని తగ్గుతుంది.
- ఫంగస్ కూడా మొక్కలను ఆరోగ్యంగా పెరగకుండా అడ్డుకుంటుంది. దాల్చినచెక్క ఈ ఫంగస్‌ను ఎంతో శక్తివంతంగా నివారిస్తుంది.
- దాల్చినచెక్కను మెత్తగా పొడి చేసి దానిని మొక్కలో ఫంగస్ ఉన్న చోట్ల చల్లాలి. ఇలా చేయడంవల్ల ఫంగస్ త్వరగా నాశనమై మొక్కలకు తగినంత పోషణ అంది వాటి పువ్వులు తొందరగా వికసిస్తాయి.
- విత్తనాలు బాగా మొలకెత్తడానికి కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. ఫంగస్, పురుగుల బెడద లాంటివి విత్తనాలకు అంటకుండా ఆరోగ్యంగా అవి మొలక లెత్తేలా జాగ్రత్త వహించాలి. ప్రారంభంలోనే విపరీత మైన తేమతో మొక్కలు దెబ్బతింటాయి. దాని నుంచి వాటిని సంరక్షించాలి. విత్తనాలు ఆరోగ్యంగా మొలక లెత్తడానికి దాల్చిన చెక్క ఎంతో ఉపయోగపడుతుంది.
- దాల్చినచెక్క లోని యాంటీ-ఫంగల్, యాంటీ-బాక్టీరియల్ సుగుణాలు ఎన్నో ఉన్నాయి. ఇవి విత్తనాల ఆరోగ్యకరమైన పెరుగుదలకు ఎంతో తోడ్పడతాయి.
- దాల్చినచెక్క వల్ల గార్డెన్‌లో దోమలు ఉండవు. ఇందు కోసం తరచూ గార్డెన్‌లో దాల్చిన చెక్క పొడిని చల్లుతుండాలి.
- దెబ్బతిన్న మొక్కలను దాల్చిన చెక్క కోలుకునేలా చేస్తుంది కూడా. మొక్కలపై ప్రతిరోజూ చిటికెడు దాల్చినచెక్క పొడిని చల్లితే మొక్కలు తేరుకుంటాయి. ■

సిరి సంపదలు మంచితనాన్ని తీసుకురావు, మంచితనం మాత్రం ఆత్మీయతను, ఆశీర్వాదాలను తీసుకువస్తుంది

# ఎరువుల గోదాములను ఎలా నిర్వహించుకోవాలి?

– పవన్ కుమార్... బి డి ఓ

తెలుగు రాష్ట్రాలలో సుమారు 1400ల రైతు వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్ పి ఓ లు, ఎఫ్ పి సి లు) వివిధ స్వచ్ఛంద ప్రోత్సాహక సంస్థల తోడ్పాటుతో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ పురోగమిస్తున్నాయి. ఈ కార్యక్రమాల పరంపరలో అన్ని సంస్థలు తప్పనిసరిగా రసాయన ఎరువుల కొనుగోలు, అమ్మకం చేపడుతున్నాయి. ప్రతి సంస్థ లక్షలలో ఈ వ్యాపారం నిర్వహిస్తుంటుంది. కావున ఎరువుల నిల్వ చాలా ప్రాధాన్యతతో కూడుకున్నది. అంటే ఎరువుల గోదాములు నిర్వహణ చాలా ముఖ్యమైనది.

గోదాముల నిర్వహణలో పాటించవలసిన వివిధ మార్గదర్శకాలను తెలుసుకుందాం.

**ఎరువుల గోదాముల నిర్వహణకు మార్గదర్శకాలు**

1. గోదాములో ఎపుడు కరెంటు (పవర్ సప్లయ్) వుండకూడదు
2. గోదాములో సరుకు వేయడానికి ముందు నేల సరిగా వుందో లేదో చూసుకోవాలి. తరువాత దానిమీద వరి పొట్టును చల్లాలి. దీనివల్ల ఎక్కడన్నా చెమ్మవున్నా వరి పొట్టు పీల్చుకుంటుంది. ఎరువుల సంచి దెబ్బతిని ఎరువు కింద పడినా వరి పొట్టులో కలిసిపోతుంది
3. ఎరువుల అమ్మకాన్ని బట్టి తర్వాత వరి పొట్టును ఎత్తి దానిని కూడా రైతులకు తిరిగి అమ్మవచ్చు
4. మన గోదాముకు ఏదయినా స్టాక్ (ఎరువుల లారీ) వచ్చినపుడు ముందుగా వారి దగ్గర నుండి ఇన్వాయిస్ పేపర్ తీసుకొని దించుకున్న స్టాక్. (ఉదాహరణ: 5 టన్నులు) ఇన్వాయిస్‌లో పేర్కొన్న స్టాక్ (ఉదాహరణ: 5 టన్నులు) సమానంగా ఉందోలేదో పరిశీలించాలి
5. స్టాక్ వచ్చినపుడు అన్ని సంచులు బాగా వున్నాయో లేక ఏవైనా దెబ్బతిన్నాయో చూసుకోవాలి. దెబ్బతిన్న (డ్యామేజి వున్న) సంచులు తీసుకోవద్దు. సంచులు దించుకునేటపుడు కూడా డ్యామేజ్ కాకుండా దించుకోవాలి
6. గోదాములో ఎరువుల సంచులు దించుకునేటపుడు నెట్ సరిగా వేస్తున్నారో లేదో చూసుకోవాలి. ఎరువుల సంచులను గోడలకు దూరంగా వేయించాలి. దించుకున్న స్టాక్‌లో సంచులు చిరిగినా, పగిలి పోయినవి వున్నా సంచులు తక్కువగా వున్నా వీటన్నిటికి గోదాము చూసుకునే ఉద్యోగి పూర్తి బాధ్యత వహించాలి
7. గోదాములో నెట్ వేసేటపుడు ప్రతి లైన్‌కి సమానంగా సంచులు వేయాలి, ప్రతి సంచిపై నెంబర్ రాయాలి
8. అమ్మేటప్పుడు ముందు వరుసవున్న సంచులనే ఇవ్వాలి. ఇలా చేయడం వలన స్టాక్ లెక్క చూసుకునేటపుడు కరెక్ట్‌గా వస్తుంది. అలా కాకుండా వేరే వరుసలో వున్న సంచులు ఇవడం వలన కౌంటింగ్ సరిగా వుండదు.



దీనివలన గోదాములో ఎన్ని సంచులు వున్నాయో లెక్క (స్టాక్ కౌంటింగ్) సరిగా తెలియదు

9. స్టాక్ అంతా కరెక్ట్‌గా దించుకున్న తరువాత వచ్చిన స్టాక్ వివరాలను ఈపోజ్ మెషిన్‌లో సరిచూసుకోవాలి. అక్కడకూడా వచ్చిన స్టాక్, మెషిన్‌లో చూపించే స్టాక్ సమానంగా వుండాలి. ఏమన్నా తేడా వుంటే ఈపోజ్ మెషిన్‌లో స్టాక్‌కు అభ్యంతరం తెలియజేయాలి. ఆ స్టాక్ ఎవరి దగ్గర నుండి వచ్చిందో వారికి ఈ సమాచారం చెప్పండి, మీ మేనేజర్‌కు తెలియజేయండి

10. రెండు రకాల నెట్‌లను కలిపి వేయకూడదు.

(ఉదాహరణకు యుఇవి నెట్‌కి మాప్ నెట్‌కి మధ్య ఒక మనిషి తిరిగేంత ఖాళీ వుండాలి)

11. ప్రతి నెట్‌కి ఒక స్టాక్ కార్డ్ ఉండాలి. స్టాక్ కార్డ్‌లో వివరాలను ఎప్పటికప్పుడు సరిచేస్తూ ఉండాలి

12. గోదాములో సరుకును ఎప్పుడు ఎఫ్ ఐ ఎఫ్ ఒ (ఫస్ట్ ఇన్ ఫస్ట్ ఔట్) పద్ధతిలో నిర్వహించాలి. అంటే మొదట ఏ సరుకు వస్తే ఆ సరుకునే మొదట అమ్మాలి

13. రైతులకు రువులు అమ్మినపుడు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలి. అమ్మకాల వివరాలను ఈపోజ్ మెషిన్‌లో నమోదు చేయాలి

14. ప్రతిరోజు సాయంత్రం ఆ రోజు మొత్తం జరిగిన అమ్మకాల వివరాలు, ఈపోజ్ మెషిన్ లో నమోదైన వివరాలు సమానంగా వుండాలి.

అదేవిధంగా గోదాములోని స్టాక్‌కి ఈపోజ్ మెషిన్‌లోని స్టాక్ సమానంగా వుండాలి

15. గోదాములో ఒక ఎరువుకు సంబంధించి రెండు బ్యాచ్ నెంబర్‌లు వున్నపుడు లేదా సంచుల మీద రెండు రకాల ధరలు వున్నపుడు వేరుగా నెట్ వేయించాలి

16. గోదాము ఎక్కడ ఉంటే అక్కడే సేల్స్ రిజిస్టర్ ఉండాలి. ప్రతిరోజు సాయంత్రం ఆ రోజు జరిగిన సేల్స్ మొత్తాన్ని సేల్స్ రిజిస్టర్‌లో నమోదు చేయాలి

17. సేల్స్‌ని బట్టి స్టోర్ ఆడిట్ లేదా స్టాక్ ఆడిట్ చేయాలి. ఆడిట్ చేసిన తరువాత వాటిని ఫైలింగ్ చేయాలి. స్టాక్‌లో ఏమన్నా తేడాలు వుంటే మేనేజర్‌కి తెలియపరచాలి

18. గోదాముకి వ్యవసాయ శాఖ అధికారులు వచ్చినపుడు మొదటిగా సేల్స్ రిజిస్టర్‌నే చూస్తారు. కాబట్టి సేల్స్ రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు తాజా వివరాలను నమోదు చేయాలి. వచ్చిన వ్యవసాయ శాఖ అధికారులతో సేల్స్ రిజిస్టర్‌లో సంతకం తీసుకోండి

19. గోదామును ఎప్పటికపుడు తనిఖీ చేసుకోవాలి అనగా కిటికీలు మూసి వున్నాయో లేదో, పైకప్పు నుండి చెమ్మ (వాటర్) వస్తున్నదా, గోదాము చుట్టూ గోడలు సరిగా వున్నాయో లేదో చూసుకోవాలి

20. ఎరువుల గోదాములో ఎప్పుడుకూడా పశువుల దాణ నిల్వ చేయకూడదు ■

## దేశంలోనే తొలిసారిగా జిన్నింగ్ మిల్లు ఏర్పాటుచేసుకున్న ఆదిలాబాద్ గిరిజన ఎఫ్ పి ఓ !

**ఆ**దిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని గిరిజన రైతులు స్వయంగా జిన్నింగ్ మిల్లు ఏర్పాటు చేసుకొని ఆదర్శంగా నిలుస్తున్నారు. దాదాపు పదేళ్ళ క్రితం 837 మంది రైతులు సంఘటితమై రైతు ఉత్పాదక సంఘంగా ఏర్పడ్డారు.

మొదట ఒక్కో రైతు 1011 రూపాయలతో సభ్యత్వం తీసుకుని ఏటా 1000 రూపాయల చొప్పున జమ చేస్తూ వస్తున్నారు. ఈ డబ్బులతో 2019 మార్చి 29న పత్తి జిన్నింగ్ మిల్లు ఏర్పాటుకు సంకల్పించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు నుండి 25 లక్షల రూపాయలు, కేడీసీసీ బ్యాంకు ద్వారా 1.50 కోట్ల రూపాయలు, నాబార్డు ద్వారా 60 లక్షల రూపాయలు రుణం తీసుకున్నారు. మొత్తం సుమారు 5 కోట్ల రూపాయలతో ఇంద్రవెల్లి మండలంలోని ఏమాయికుంట గ్రామ శివారులో చేపట్టిన పనులు ఇటీవల పూర్తయ్యాయి.

ఏజెన్సీలోని రైతులు దేశంలోనే ప్రథమంగా ఏర్పాటు చేసుకున్న ఈ జిన్నింగ్ మిల్లును ఇటీవల నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) శ్రీ యడ్ల కృష్ణారావు ప్రారంభించారు. కార్యక్రమంలో నాబార్డు జీఈఎం జ్యోతిస్వరూప్, డీడీఎం రాజశేఖర్‌రెడ్డి, ఏడీసీసీ సీఈఓ శ్రీధర్‌రెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్, రైతు సంఘం ఛైర్మన్ మెస్రం తానుబాయి, సంఘం వైస్‌ఛైర్మన్ ఆత్రం భీంరావు తదితరులు పాల్గొన్నారు. ■

జీవితమంతా ఇవ్వడమే అని తెలుసుకో, ప్రకృతే బలవంతంగానైనా నీతో యిప్పిస్తుంది, నీకుగా నీవే యిస్తే మేలు కదా!

# ధరణి యఫ్.పి.ఓ కు శ్రీ సి.యస్ రెడ్డి పర్యటన

జి. శ్రీనివాస్

కామారెడ్డి జిల్లాలోని సదాశివనగర్ మండలంలో డి.జి.ఆర్.వి సహకారంతో ఏపిమాస్ ఏర్పాటుచేసిన ధరణి రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్ పి ఓ) కార్యకలాపాలను, నిర్వహణ విధానాలను పర్యవేక్షించటానికి 2021 జనవరి 7న ఏపిమాస్ సి.ఇ.ఓ శ్రీ సి.యస్ రెడ్డి, ప్రధాన కార్యాలయం సిబ్బంది ధరణి యఫ్.పి.ఓ గ్రామాలలో పర్యటించారు.

పర్యటనలో భాగంగా ముందుగా తిర్మన్‌పల్లి గ్రామంలో



ఒక రైతు సంఘం సభ్యులతో మాట్లాడారు. రైతు సంఘం సభ్యులు వారు చేస్తున్న కార్యక్రమాలు చెప్పారు. అందులో ముఖ్యంగా ప్రతినెల సమావేశం చక్కగా నిర్వహిస్తున్నారని, సభ్యులందరూ ప్రతినెల క్రమం తప్పకుండ పొదుపులు చేస్తున్నారని, అవసరానికి సభ్యులు అప్పులు తీసుకుంటూ, వాటిని తిరిగి చెల్లిస్తున్నారని చెప్పారు. సమావేశంలో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు సంబంధించి ఒక ప్రణాళిక తయారు చేసుకొని విత్తనాలు, ఎరువులు పురుగు మందులు అన్నీ ధరణి రైతు సేవా కేంద్రంలో కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.

స్వయం నియంత్రణ ఉద్యమం లోని కార్యక్రమంలో భాగంగా ప్రతినెల పుస్తక నిర్వహణ నిర్వహిస్తున్నామని, సంవత్సరానికి ఒకసారి సంఘం ఆడిట్ చేయిస్తున్నామని, లీడర్ల మార్పిడి కూడా జరుగుతున్నదని పేర్కొన్నారు.

అనంతరం శ్రీ సి ఎస్ రెడ్డి బృందం అదే గ్రామంలోని 'గ్రామ రైతు సంఘం' సభ్యులతో మాట్లాడారు. గ్రామ రైతుసంఘం సభ్యులు మాట్లాడుతూ ప్రతినెల సంఘాల ప్రతినిధులందరం సమావేశమై కట్టుబాట్లు ఏర్పాటు చేసుకొని క్రమం తప్పకుండ సమావేశం నిర్వహిస్తున్నామని, సంఘాల తరపున హాజరైన ప్రతినిధులు అందరం కలిసి ఒక ఎజండా ఏర్పాటు చేసుకొని మీటింగ్‌లో సంఘాల పనితీరు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పనిముట్ల గురించి రైతు సభ్యులకు కావాల్సిన వ్యవసాయ అవసరాల గురించి చర్చిస్తామని, గ్రామ రైతు సంఘంలో పొదుపులు కూడా చేస్తున్నామని తెలిపారు. ప్రతినెల సమావేశంతోపాటుగా సంవత్సరానికి ఒకసారి అంతర్గత ఆడిట్ నిర్వహించి, వార్షిక మహాసభను చక్కగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

గ్రామంలోని రైతులందరినీ ఈవిధంగా సంఘాల ద్వారా సంఘటిత పరచటానికి ఏపిమాస్ శిక్షణలు , నిరంతర సాంకేతిక సహకారం ఎంతైనా దోహద పడిందని తెలిపారు. రాబోవు రోజులలో గ్రామ రైతుసంఘం ద్వారా రైతులకు వారి అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు తయారుచేసి కార్యక్రమాలు చేస్తామన్నారు.

తదుపరిగా ధరణి రైతు ఉత్పత్తిదారుల సంస్థ సభ్యులతో, సిబ్బందితో సమావేశమై, యఫ్.పి.ఓ ద్వారా చేస్తున్న కార్యక్రమాలను శ్రీ సి ఎస్ రెడ్డి బృందం తెలుసుకున్నది. ప్రస్తుతం యఫ్.పి.ఓ లో 10 పంచాయతీల నుండి 808 మంది వాటాదారులు ఉన్నారని , రాబోవు మూడు నెలలలో ఇంకా 200 మంది సభ్యులను చేర్చి వెయ్యి మందికి పైగా సభ్యులు అయ్యేలాగా చేస్తామని తెలిపారు. ఈ సంవత్సరంలో



బాధ్యతలు తీసుకొని, స్వయం నియంత్రణ ఉద్యమం కార్యక్రమాలను ఏపిమాస్ సిబ్బంది సహకారంతో నిర్వహిస్తున్నామని తెలిపారు.

భవిష్యత్ ప్రణాళిక గురించి మాట్లాడుతూ సదాశివనగర్ మండలంలో పత్తి ఎక్కువ పండుతున్నదని, వారికి పత్తి జిన్నింగ్ మిల్లు, గోదాము, హార్వెస్టర్ లాంటివి ఏర్పాటు చేయటం కోసం ప్రణాళికలు చేస్తున్నామని, ఇందుకు ఏపిమాస్ తమకు సహకారం అందించాలని బోర్డు సభ్యులు కోరారురు.

అదనంగా వెయ్యి రూపాయల చొప్పున ప్రతి సభ్యులు వాటాధనం పెంచుకుంటామని తీర్మానించుకున్నట్టు వివరించారు. ప్రతినెల బోర్డు సభ్యుల సమావేశం, ప్రతి మూడు నెలలకు ఒకసారి గ్రామ రైతు సంఘాల ప్రతినిధుల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభ్యులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు పురుగు మందులు అన్నీ ధరణి రైతు సేవా కేంద్రం ద్వారా అమ్మకం చేస్తున్నట్లు పేర్కొన్నారు. గత సంవత్సరంలో దాదాపు 80 లక్షల టర్నోవర్ జరిగిందని తెలిపారు.

ఈ సంవత్సరం రబీ, ఖరీఫ్ సీజన్లలో తెలంగాణా మార్క్ ఫెడ్ ద్వారా రెండు మక్కజొన్న కేంద్రాలను మంజూరు చేయించుకున్నామని, పౌర సరఫరాల శాఖ ద్వారా రెండు వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసుకొని రైతులు పండించిన పంటలను ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేశామని, తద్వారా రైతులకు వ్యాపార సేవలు అందించామని, ఈ వ్యాపార కార్యక్రమాల ద్వారా తమ సంస్థ లాభాలను కూడా పొందినట్టు తెలిపారు. రైతు సేవా కేంద్రం ద్వారా వ్యవసాయ పనిముట్లను కిరాయికి ఇస్తున్నామని కూడా వివరించారు.

బోర్డు సభ్యులే కమిటీలుగా ఏర్పడి

శ్రీ సి.యస్.రెడ్డి గారు మాట్లాడుతూ సభ్య రైతులకు ఇంత చక్కని సేవలు అందిస్తున్నందుకు ధరణి యఫ్ పి ఓను ఎంతగానో అభినందించారు. ఇప్పటివరకు వివిధ రకాలుగా సహకారం అందించిన ఏపిమాస్ రాబోవు రోజులలో ఇంకా కావలసిన సాంకేతిక సహకారం అందిస్తుందని చెబుతూ, తెలంగాణలోనే ధరణి యఫ్.పి.ఓ అగ్రగామిగా నిలవాలని కోరారు.

ఈ పర్యటనలో శ్రీ సి.యస్.రెడ్డి గారి వెంట ఏపిమాస్ సిబ్బంది అర్లిన్ క్రిస్టినా, విష్ణువర్ధన్, దివ్య, జి. శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, అమృత పాల్గొన్నారు. ■



# బాధితులకు బాసట ... ఆకలితీర్చే అన్నపూర్ణ !

*ప్రజాస్వామిక హక్కులకు భంగం కలిగిన ప్రతిసారీ ఆమె గళమెత్తుతారు. న్యాయం పక్షాన నినదిస్తారు. ఇంట, బయట హింసను ఎదుర్కొనే బాధితురాళ్ళకు బాసటగా నిలుస్తారు. ఆపదవేళ సాటి మనిషికి సాయం చేసేందుకు ముందుకొస్తారు. అలా లాక్‌డౌన్‌లో కొన్నివందల మంది నిరుపేదల ఆకలి తీర్చారు. హైదరాబాద్‌ను వరదలు ముంచెత్తినప్పుడు నాలుగు వేల కుటుంబాలకు సాయమందించారు. "అన్నం తింటున్న ప్రతి ఒక్కరూ, అన్నదాతకు అండగా నిలవాలి" అనే సంకల్పంతో ఢిల్లీలోని సింఘు సరిహద్దుకెళ్లి రైతు ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. ఆమే అమూమత్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఖలీదా పర్వీన్. ఆమె 'ఆంధ్రజ్యోతి' (నవ్య) తో ముచ్చటించారు. ఆంధ్రజ్యోతి సౌజన్యంతో ఆ విశేషాలను 'మహిళా సాధికారత' పాఠకులకు అందిస్తున్నాం ...*

**"నీ** తల్లి పాదాల కిందే స్వర్గముంద"ని దివ్య ఖురాన్ బోధిస్తుంది. ఆడవాళ్ల పట్ల అణకువగా మసులుకోమనీ చెబుతుంది. అందుకు విరుద్ధంగా మహిళలపై అణచివేత, ఆంక్షలు పెచ్చుమీరాయి. ఇస్లాం ప్రకారం వరకట్నం తీసుకోవడం నిషిద్ధం. వరుడే వధువుకి మెహర్ (కన్యాశుల్కం) చెల్లించాలి. కానీ అమ్మాయి తెల్లగా అందంగా ఉండాలి. బాగా చదువుకోనుండాలి. సంప్రదాయబద్ధంగా నడుచుకోవాలి. ఆస్తిపరురాలవ్వాలి వంటి డిమాండ్స్ అబ్బాయిల వైపు నుంచి బాగా పెరిగాయి.




దాంతో ముస్లిం కుటుంబాల్లోనూ కట్న, కానుకల కోసం భార్యను వేధిస్తున్న కేసులు ఈ మధ్య ఎక్కువయ్యాయి. రోజుకి ఆరునుంచి పది మంది బాధితురాళ్లు మమ్మల్ని ఆశ్రయిస్తుంటారు. అందులో తొంభై శాతం మహిళలు భర్త, అత్తమామల చేతిలో వేధింపులు ఎదుర్కొంటున్నవాళ్లే. బాగా చదువుకొన్న ఒక అబ్బాయి, తాను పెళ్లికి పనికిరానని తెలిసి కూడా పీజీ చదివిన అమ్మాయిని పెళ్లాడాడు. తర్వాత విషయం తెలిసినా అమ్మాయి సహించి, భర్తతోనే జీవితాంతం కలిసుండాలని కోరుకుంది. కానీ అతను మాత్రం అనుమానంతో నిత్యం ఆమెను మానసికంగా, శారీరకంగా వేధించడం మొదలుపెట్టాడు. ఏడాదిన్నర గడిచాక, ఆ సంగతి గ్రహించిన అమ్మాయి పుట్టింటోళ్లు, ఒంటి నిండా దెబ్బలతో ఉన్న తనను ఒకరోజు మా కౌన్సెలింగ్ సెంటర్‌కి తీసుకొచ్చారు. సరే! తర్వాత చట్ట ప్రకారం అతనికి తగిన శిక్షపడేలా చూశాం. ముస్లిం పర్సనల్ లా ప్రకారం ఆ జంట విడాకులూ తీసుకున్నారు.

కానీ బాగా చదువుకొన్న అమ్మాయిలు సైతం హింసను సహించడం బాధాకరం. ఆలు,మగలు విడిపోవాలనుకుంటే... తలాక్ చెప్పే అవకాశం మగాళ్లకెలా ఉందో, ఖులా చెప్పే హక్కునూ ఆడవాళ్లకు ఇస్లాం న్యాయశాస్త్రం కల్పించింది. అయితే, బాకీపడ్డ మెహర్‌ను చెల్లించకుండా ఉండేందుకు విడాకులు పొందాలనుకొనే కొందరు భర్తలు, 'ఖులా' చెప్పాలని భార్యలను బాధిస్తున్న కేసులు మా దృష్టికొస్తుంటాయి. అలాంటి సమయంలో ముస్లిం పర్సనల్ లా ప్రకారమేగాక, అవసరాన్ని బట్టి ఐపీసీ చట్టాలనూ ఆశ్రయిస్తున్నాం. ఇక

**స్వార్థం లేకుండా వుండడమే అన్ని నీతులలోకి గొప్పనీతి. స్వార్థంతో కూడిన ప్రతి పనీ ప్రగతిని అడ్డుకునేదే**

చిన్నచిన్న అపార్థాలతో సంసారాన్ని పాడుచేసుకునే జంటలూ తారసపడుతుంటాయి. వాళ్లను తిరిగి ఒక్కటి చేసేందుకు ప్రయత్నిస్తుంటాం. అందుకు మావద్ద ఎనిమిదిమంది ఫ్యామిలీ కౌన్సెలర్లు నిరంతరం అందుబాటులో ఉంటారు. ప్రీ మ్యారిటల్ కౌన్సెలింగ్ సేవల్నీ మొదలుపెట్టాం.

**అమ్మ ప్రేమతో...**

మహిళా సాధికారతతోనే దేశం ముందుకెళుతుందని నా ప్రగాఢ విశ్వాసం. అందుకే కొందరు మహిళలతో కలిసి పదేళ్ల కిందట 'అమూమత్ సొసైటీ' నెలకొల్పాం. అమూమత్ అంటే 'అమ్మలు' అనర్థం. కష్టంలో ఉన్న ఆడవాళ్లను అమ్మలా అక్కున చేర్చుకొని, ఆదరించాలనేదే మా సంస్థ ప్రధాన ఉద్దేశం. ఆడవాళ్లలో ఆత్మవిశ్వాసం పెంచేందుకు రకరకాల కార్యక్రమాలనూ నిర్వహిస్తున్నాం. అందులో భాగంగా బస్తీల్లో బడికి దూరమైన 18ఏళ్ల లోపు అమ్మాయిలను గుర్తించి, ఓపెన్ స్కూలు ద్వారా వాళ్లను మళ్లీ చదువుకు దగ్గర చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. అందుకు కావాల్సిన పుస్తకాలు, ఫీజుల బాధ్యత మాదే. ప్రతియేటా ఐదుగురు అమ్మాయిల ఉన్నత చదువుకు కావాల్సిన ఆర్థిక సహాయాన్ని సమకూర్చుతున్నాం.

మా సంస్థ సేవల్ని కేవలం ముస్లింమహిళలకే పరిమితం చేయలేదు. కుల, మతాలకు అతీతంగా సమాన దృక్పథంతో వ్యవహరించడం మా సంస్థ ప్రథమ నియమం. నేను అల్లాను ఆరాధించినా, భారత రాజ్యాంగానికి విధేయురాలిని. ఈ దేశ పౌరురాలిని. కనుక ప్రజాస్వామిక విలువల పరిరక్షణ ఉద్యమాల్లో ముందుంటా. అదే నాకు ఆనందం కూడా. తెలంగాణ మహిళా, ట్రాన్స్‌జెండర్ సమన్వయ పోరాట కమిటీలోనూ భాగస్వామినైనందుకు గర్విస్తున్నా.

**ఒక భారతీయురాలిగా...**

కొత్త వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలోని రైతుల పోరాటం నన్ను కదిలించింది. నాది వ్యవసాయ కుటుంబం కాకపోవచ్చు. మా తాత, తండ్రి రైతులు కాకపోవచ్చు. కానీ ఒక భారతీయురాలిగా నాకు వ్యవసాయంతో అవినాభావ సంబంధం ఉంది. ఆ మాటకొస్తే, ఈ దేశంలోని ప్రతి మనిషి మనుగడ పాడి, పంటతో ముడిపడుంది. మూడు పూటలా అన్నం తింటున్న వ్యక్తిగా అన్నదాతకు మద్దతు పలకడం నా కర్తవ్యం అనుకున్నా. అప్పటికప్పుడు ఢిల్లీ వెళ్లా! సింఘు సరిహద్దులో రెండురోజులున్నాను. అక్కడి రైతులు నన్ను తమ ఇంటి ఆడపిల్లకు మల్లే ఆదరించారు. వేలమంది తచ్చాడే ఆ పరిసరాల్లో అపరిశుభ్రతకు తావేలేదు. తాత్కాలిక మరుగుదొడ్లు అయితే చాలా పరిశుభ్రంగా ఉన్నాయి. వందల మంది వినియోగించే టాయిలెట్లను అంత క్లీన్‌గా ఎలా ఉంచగలుగుతున్నారా అని ఆశ్చర్యమేసింది.

రైతు పోరాట క్షేత్రంలోని సమైక్య జీవన సౌందర్యానికి ముగ్ధురాలినై, అక్కడికక్కడే తెలుగులో ఒక కవిత రాసి వాళ్లకు చదివి వినిపించా. వారంతా చాలా సంతోషించారు. నేనున్న రెండు రోజుల్లోనే ఒక జీవితకాలానికి సరిపడా స్థైర్యాన్ని, సంతోషాన్ని పొందాను. తామనుకొన్నది సాధించుకొనే తిరిగెళతామనే మొక్కవోని దీక్ష ఆ రైతులందరి ముఖాల్లో నాకు కనిపించింది.

**వరద సాయం...**

హైదరాబాద్‌లోని వరద ముంపు ప్రాంతాల్లోనూ వారం పాటు రోజుకొక వెయ్యిమందికి సరిపడా ఆహారం వండి పంపాం. వరద బాధితుల సహాయార్థం అమూమత్ స్టోర్ తెరిచాం. తద్వారా బాధితులకు కుక్కర్, వంటపాత్రలు, గ్యాస్‌స్టవ్ తదితర వంటసామాగ్రి, నిత్యావసరాలు, వస్త్రాలు, దుప్పట్లు తదితర వస్తువులను పంచాం. సుమారు నాలుగు వేల కుటుంబాలకు అమూమత్ వరద సాయమందించిందని గర్వంగా చెప్పగలను. నష్టపోయిన కొందరు వీధివ్యాపారులకు తిరిగి జీవనోపాధి కల్పించేందుకు అవసరమైన సామాగ్రిని సమకూర్చాం. లాక్‌డౌన్‌లోకానీ, వరద సమయంలోనైనా మేం చేపట్టిన సహాయ కార్యక్రమాలకు యువత అండగా నిలవడం నాకు సంతోషాన్నిచ్చింది. నా ప్రతి కార్యక్రమాన్ని సోషల్‌మీడియాలో షేర్ చేసుకోవడం ద్వారా, చాలామంది యువతీ, యువకులు ముందుకొచ్చి, వలంటీర్లుగా వ్యవహరించారు. వాళ్లందరి తోడ్పాటుతోనే క్లిష్ట సమయాల్లో నాకు చేతనైనంత మేరకు పరులకు సాయపడగలిగాను.

**మూఢాచారాలకు వ్యతిరేకంగా...**

ముస్లిం సమాజంలోనూ మూఢాచారాలు, అంధ

**మనిషికి వ్యక్తిత్వం వున్నట్లే దేశానికీ, జాతికీ ప్రత్యేక వ్యక్తిత్వం వుంటుంది; దాన్ని పరిరక్షించుకోకుంటే ఆ జాతి నశిస్తుంది**

విశ్వాసాల వల్ల మరీ ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేతబడి, బాణామతికి మల్లే జాదు–టోనా పేరుతో అమాయకులను మోసం చేసి కొందరు జాదూగర్లు సొమ్ము చేసుకుంటున్నారు. అలాంటి మాయగాళ్లను గుర్తించి, నేను వాళ్ల ఆటలు కట్టించిన సందర్భాలున్నాయి. అప్పుడు నాపై కొందరు బెదిరింపులకూ పాల్పడ్డారు. అయినా, భయపడలేదు. 'అమూమత్ సొసైటీలో అంతా ఆడవాళ్లే ఉంటారు కదా. ముఫ్తీ (మగ న్యాయకర్త) లేకుండా భార్య, భర్తల మధ్య తగవులెట్ల తీరుస్తరు. కనుక మీరు కౌన్సెలింగు సెంటర్ నడపనీకే వీల్లేదన్నారు. అలాంటోళ్లకూ గట్టిగా బదులిచ్చాం. మహిళా సాధికారతకు అడ్డుగా నిలుస్తున్న పలు సమస్యలను గుర్తించి, వాటిపై మరింత ఎక్కువ శ్రద్ధ పెట్టి పని చేయాలనుకుంటున్నాం. అందుకోసం మా సేవల్ని విస్తృతం చేసేందుకూ ప్రయత్నిస్తున్నాం.

**అపోహలు పోగొట్టాలి...**

ముస్లింలపట్ల మిగతా సమాజంలో చాలారకాల అపోహలున్నాయి. అంతెందుకు, నేను ఎన్నోసార్లు వివక్ష ఎదుర్కొన్నాను. కొన్నేళ్ల కిందట వరంగల్‌లో మేమొక ఇల్లు కిరాయికి తీసుకున్నాం. ముస్లింలకు ఇల్లెట్లా ఇస్తారని మా ఇంటి యజమాని మీద చుట్టుపక్కవాళ్లంతా కోపడ్డారు. 'మీరు మాంసం తిని బొక్కలు పక్కిళ్లలోకి విసిరేస్తారట కదా' అని పక్కింటామె నా ముఖంమీదే అడిగింది. పాతబస్తీలో ఎవడో ఒక గల్లీ లీడర్ అండతో కొద్దిమంది కరెంటు బిల్లు, ఇంటి పన్ను కట్టకుంటే, మిగతా ముస్లిం కమ్యూనిటీనంతా నిందించడం సరైందేనా? ఇలా ఒకటా, రెండా ముస్లింలమీద ఎన్నో దుష్ప్రచారాలు సాగుతున్నాయి. రకరకాల రాజకీయ కారణాల వల్ల అవి ఇప్పుడు మరింత పెరిగాయి. వాటిని ప్రభుత్వాలే పోగొట్టాలి. మతాలు వేరైనా మనుషులంతా కలిసుండాలని నమ్ముతాను. అందుకోసం నా వంతు కృషి చేస్తాను."

**ఫ్రైడే కిచెన్...**

లాక్‌డౌన్‌లో మా ఇల్లు ఒక కమ్యూనిటీ కిచెన్‌ను తలపించేది. మా గల్లీలోని యువకులంతా మా ఇంటి ఆవరణలో జమయ్యేవారు. అదీ కరోనా నిబంధనలు పాటిస్తూనే. మేమంతా కలిసి రోజుకి 500 మందికి సరిపడా భోజనాలను వండేవాళ్లం. తర్వాత వాటిని ప్యాక్ చేసి, వివిధ ప్రాంతాల్లోని పేదలు, వలస శ్రామికులకు పంచేవాళ్లం. జనతా కర్ఫ్యూ రోజు సాయంత్రం ఆరింటప్పుడు మా ఇంటి ముందుగా ఒక ముసలాయన నీరసంగా కాళ్లీడ్చుకుంటూ వెళ్లడం చూశా. ఆయన్ని ఆపి, "అన్నం తిన్నావా" అనడిగితే, "లేదమ్మా" అన్నాడు. అప్పటికప్పుడు అతని ఆకలి తీర్చినా, నా మనసెందుకో కుదుటపడలేదు.

'పొరుగు వ్యక్తి పస్తుంటే, పరలోకంలో నీవు ప్రశ్నించబడతావు' అని 'హదీస' లోని మహమ్మద్ ప్రవక్త మాటలు గుర్తొచ్చాయి. ఆ వెంటనే యాభై మందికి అన్నంకూర వండి, ప్యాక్ చేసి తీసుకెళ్లి, పేవ్‌మెంట్ల మీద ఉండే వాళ్లకు పంచాను. రెండవరోజు నాకు మా కాలనీ యువకులతో పాటు మరికొందరు మహిళల సాయం తోడైంది. మేమంతా కలిసి...అన్నానికి నోచుకోని నిరుపేదలుండే కొన్ని ప్రాంతాలను గుర్తించాం. అక్కడ రోజూ మధ్యాహ్నం ఆహారం పంచేవాళ్లం. మరొకరోజు చింతల్‌మెట్ ప్రాంతంలో ఒక పెద్దామె "మా పాలిట అన్నపూర్ణమ్మలా వచ్చినవు. నీవు సల్లగుండాలె" అంటూ నన్ను దీవించడం మరిచిపోలేను. అలా 64రోజుల పాటు నిత్యం ఐదొందల మంది ఆకలితీర్చే అవకాశం కలిగింది. అదే స్ఫూర్తితో "ఫ్రైడే కిచెన్" పేరుతో ప్రతి శుక్రవారం వందమంది పేదలకు భోజనం అందిస్తున్నాం.

**నాకిష్టమైన తెలుగు టీచర్...**

నేను పుట్టింది కేరళలోని పాలక్కాడ్. మా నాన్న ఉద్యోగరీత్యా నా పదో ఏట హైదరాబాద్‌కి వచ్చాం. అప్పటి నుంచి నా చదువు, పెళ్లి, ఉద్యోగం, సోషల్ సర్వీసు అంతా ఇక్కడే. చిన్నప్పుడు స్కూల్లో మా తెలుగు టీచర్ మురహరాచార్యులు సర్ ప్రోత్సాహం వల్లే నేనింత బాగా తెలుగు మాట్లాడగలుగుతున్నా. తెలుగులో కవిత్వం కూడా రాయగలుగుతున్నా. అప్పట్లో నేను ఆటవెలది, తేటగీతిలో పద్యాలు కూడా రాసేదాన్ని. ఆయన నన్ను సొంత బిడ్డలా చూసేవారు. ఇప్పటికీ మురహరాచార్యులు సర్‌ని తలచుకోని రోజు లేదు. ■

# మోడల్ పట్టణంగా కనిగిరి నగర పంచాయతీ

## యునిసెఫ్, ఏపిమాస్ భాగస్వామ్యంలో అభివృద్ధికి కృషి

కనిగిరి నగర పంచాయతీని మోడల్ పట్టణంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని యునిసెఫ్ ప్రతినిధి శ్రీ సుభాష్ తెలిపారు. కనిగిరిలోని షాదీఖాన్ భవన్‌లో ఇటీవల 'కమ్యూనిటీ మేనేజెడ్ అర్బన్ వాష్ సర్వీస్ పథకం' ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ యునిసెఫ్, ఏపిమాస్ సంయుక్త భాగస్వామ్యంలో పట్టణ ప్రాంతాలలో నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత (వాష్) అంశాలకు సంబంధించి ప్రవర్తనలో మార్పుకోసం 'కమ్యూనిటీ మేనేజ్డ్ అర్బన్ ప్రాజెక్టు' ఒక ప్రయోగాత్మక



పథకంగా 2020 నవంబర్‌లో ప్రారంభించడం జరిగిందని, ఈ ప్రాజెక్ట్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని 5 మునిసిపాలిటీలలో (ఆళ్ళగడ్డ, నందికొట్కూరు, మడకశిర, కనిగిరి, సూళ్ళూరు పేట లలో) అమలుచేయడం జరుగుతున్నదని తెలిపారు.

ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశం ఎంపిక చేయబడిన 5 మునిసిపాలిటీలలో ప్రజలకు నాణ్యమైన వాష్ సేవలు అందేలా తోడ్పడటం. కనిగిరిలో నీరు, పారిశుద్ధ్యం పరిశుభ్రత (వాష్)లకు సంబంధించిన ప్రస్తుత స్థితిగతులను పరిశీలించి మౌలిక సదుపాయాలపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని, ప్రజలందరికీ అర్బన్ లోకల్ బాడి, మెప్మా, టి ఎల్ ఎఫ్, ఎస్ ఎల్ ఎఫ్, వార్డ్ శానిటేషన్ సెక్రటరీలు, స్థానిక నాయకులు, సంబంధిత వివిధ ప్రభుత్వ శాఖలు, ఏపిమాస్ సంస్థ కలిసి పని చెయ్యడం జరుగుతుందని, ఈ విధంగా త్వరలో కనిగిరిని మోడల్ టౌన్‌గా చేస్తామని దానికి అందరూ సహకరించాలని కోరారు. నగర పంచాయతీ కమీషనర్ డివిఎస్ నారాయణరావు మాట్లాడుతూ ప్రస్తుతం కనిగిరిలో ఉన్న నీటి సౌకర్యం, పారిశుద్ధ్యం పరిశుభ్రతల గురించి తెలియచేసి, వీటిని ఇంకా మెరుగుపరచటానికి యునిసెఫ్, ఏపిమాస్ సంస్థలవారు ముందుకురావటం, ఈ ప్రాజెక్ట్ కనిగిరికి రావడం సంతోషంగా ఉందన్నారు. పై 3 అంశాలలో మునిసిపాలిటీ నుండి పూర్తి సహాయ సహకారాలు అందించి కనిగిరిని మొదటి స్థానంలో ఉంచుతామని తెలియజేశారు.


మెప్మా పిడి శ్రీ రఘు మాట్లాడుతూ మహిళా సంఘాలు ఎప్పుడూ పరిశుభ్రతలో ముందు ఉంటారని పూర్తి సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థి శ్రీ షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో ప్రభుత్వం సహాయం అందించడానికి ఎప్పుడు ముందుంటామని, అందరిని కలుపుకుని ప్రజలకు అన్నింటిపై అవగాహన కల్పించి, కనిగిరిని మోడల్ టౌన్‌గా చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. మహిళా నాయకురాలు టి.సుజాత గారు మాట్లాడుతూ మంచి పనికి మా మహిళలు అందరూ ఎప్పుడూ ముందుంటారని, అందరం కలిసి కనిగిరిని మంచి మోడల్ టౌన్‌గా చేసుకుంటామని తెలియజేశారు.

సిడీపీవో బి.లక్ష్మీప్రసన్న గారు, టిపిఎస్ శాంతి గారు మాట్లాడుతూ అందరం కలిసి ప్రజలకు అవగాహన కలిపిస్తూ కనిగిరిని జబ్బులులేని పట్టణంగా తీర్చిదిద్దేందుకు పాటుపడతామని తెలిపారు. ఏపిమాస్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్, మెప్మా చంద్రశేఖర్, మునిసిపల్ ఏఈ భూపాల్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, ఏపి ఎంఏ ఎస్.కనిగిరి కోఆర్డినేటర్ భాస్కర్, మెప్మా సిఎం ఎం కల్పన, సిఓ సురత్న, దీప్తి, ఎంఈసిసి ఎస్, టి ఎల్ ఎల్ అధ్యక్షులు, ఎస్ ఎల్ ఎఫ్ ఒబిఎస్, ఆర్ పి ఎస్, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు. ■

ఆదర్శమైన పనికోసం చేసే ప్రయత్నంలో వేయి సార్లు ఓటమి చవిచూసినా మరో మారు ప్రయత్నించండి

# ఇక పంటలు కొనే కేంద్రాలుండవు: నిరంజన్‌రెడ్డి

రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇకపై కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం లేదని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల మంత్రి నిరంజన్‌రెడ్డి స్పష్టం చేశారు. కొత్త చట్టాలు వచ్చినందున కనీస మద్దతు ధర నిర్ణయాధికారం కేంద్రం చేతుల్లోనే ఉందని ఆయా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పంటలు కొనుగోలు చేయలేని పరిస్థితుల గురించి రైతులకు వివరించాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల జిల్లా అధికారులను ఆయన ఆదేశించారు. బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు సమావేశ మందిరంలో శనివారం యాసంగి కొనుగోళ్ళకు సంసిద్ధత – ప్రణాళికపై జిల్లాల అధికారులతో ఆయన సమీక్ష జరిపారు.



అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. కరోనా నేపథ్యంలో రైతులు ఇబ్బందులు పడకూడదని ప్రభుత్వం అన్ని పంటలకు మద్దతు ధరను ఇచ్చి కొనుగోలు చేసిందన్నారు. కరోనాకు వ్యాక్సిన్ అందుబాటులోకి రావడం, యాసంగికి పంటలు చేతికంద దానికి సమయం ఉన్నందున రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని మార్కెట్లను సిద్ధం చేశామని చెప్పారు. ఏటా 30 శాతం పంటలే వ్యవసాయ మార్కెట్లకు వస్తాయని, మిగతా వాటి అమ్మకాలు బయటే జరుగుతాయని వివరించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు.

కేంద్రం కొత్త చట్టంలో కనీస మద్దతు ధర అంశాన్ని పొందుపరచనందున, ఏ పంటను ఎంతకు కొనుగోలు చేయాలనే విషయాన్ని ప్రకటించాలని సూచించారు. పంటలను అమ్మడానికి ఏ రోజు ఏ గ్రామ రైతులు మార్కెట్లకు తేవాలో తేదీలను వివరిస్తూ వారికి రైతువేదికల వద్ద కూపన్లను పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అంచనాలకు మించి పంటల దిగుబడి ఉంటే గిడ్డంగుల వద్దనే వ్యాపారులు కొనుగోలు జరిపేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## తెలంగాణా మార్క్‌ఫెడ్ ఎం డి గా శ్రీ పబ్బతి యాదిరెడ్డి

తెలంగాణా స్టేట్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ (టి ఎస్ – మార్క్‌ఫెడ్) మేనేజింగ్ డైరెక్టర్‌గా శ్రీ పబ్బతి యాదిరెడ్డి నియమితులయ్యారు. కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌గా పని చేస్తున్న శ్రీ యాదిరెడ్డిని ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఎం డి గా నియమించింది. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వ కార్యదర్శి ఏ పి సి జనార్దనరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. రెవిన్యూ శాఖలో పని చేస్తున్న శ్రీ యాదిరెడ్డి గతంలో నిజామాబాద్ ఆర్ డి ఓ గా పని చేశారు. అనంతరం సూర్యాపేట డి ఆర్ ఓ గా, కామారెడ్డి అడిషనల్ జాయింట్ కలెక్టర్‌గా పని చేశారు. ప్రస్తుతం కామారెడ్డి అదనపు కలెక్టర్‌గా పని చేస్తున్నారు.



కొద్దిరోజులక్రితం స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఎంఈ సుధాకర రెడ్డి ఒక విశ్రాంత ఉద్యోగి నుంచి 75 వేల రూపాయలు లంచం తీసుకుంటూ ఏ సి బి వలలో చిక్కుకున్నారు. ఎస్ డబ్ల్యు సి ఎండి వి. భాస్కరాచారి ఆదేశాలమేరకే తాను లంచం తీసుకున్నట్టు ఏ సి బి అధికారులకు చెప్పడంతో ఆయనపైనా కేసు నమోదైంది. అందువల్ల భాస్కరాచారిని తప్పించిన ప్రభుత్వం శ్రీ యాదిరెడ్డిని ఆ స్థానంలో నియమించింది. ■

నిరంతరం వెలిగే సూర్యుణ్ణి చూసి చీకటి భయపడుతుంది, నిరంతరం శ్రమించే వ్యక్తిని చూసి ఓటమి భయపడుతుంది

# యాదాద్రి యఫ్.పి.ఓ ప్రతినిధుల ధరణి సందర్శన

**– జి. శ్రీనివాస్**

**20**21 జనవరి 16 న యాదాద్రి భువనగిరి జిల్లాలోని 'పీస్', 'గ్రామ వికాస్ స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన నాలుగు రైతు ఉత్పత్తిదారుల సంస్థల బోర్డు సభ్యులు, సిబ్బంది దాదాపు 30 మంది కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని ధరణి రైతు ఉత్పత్తిదారుల సంస్థకు క్షేత్ర సందర్శనకు వచ్చారు.



క్షేత్ర సందర్శనలో భాగంగా ముందుగా తిమ్మోజివాడి గ్రామంలో రెండు గ్రూపులుగా ఏర్పడి రెండు రైతు సంఘాల సభ్యులతో మాట్లాడారు. రైతు సంఘం సభ్యులు వారు చేస్తున్న కార్యక్రమాలను చూసి, విని అవగాహన పొందారు. ముఖ్యంగా ప్రతినెల సమావేశం చక్కగా నిర్వహిస్తున్నారని, సభ్యులందరూ ప్రతినెల క్రమం తప్పకుండ పొదుపులు చేస్తున్నారని, సభ్యులు అవసరానికి అప్పులు తీసుకుంటూ, సక్రమంగా వాటిని తిరిగి చెల్లిస్తున్నారని రైతు సంఘాల సభ్యులు చెప్పారు. సమావేశంలో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు సంబంధించి ఒక ప్రణాళిక తయారుచేసుకొని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అన్నీ ధరణి రైతు సేవా కేంద్రంలో కొనుగోలు చేస్తున్నట్లు చెప్పినారు. స్వయం నియంత్రణ ఉద్యమం లోని కార్యక్రమంలో భాగంగా ప్రతినెల పుస్తక నిర్వహణ నిర్వహిస్తున్నామని, సంవత్సరానికి ఒకసారి సంఘం ఆడిట్ చేయిస్తున్నామని, లీడర్ల మార్పిడి కూడా జరుగుతున్నదని తెలిపారు.

తదుపరిగా అదే గ్రామంలోని గ్రామ రైతు సంఘం సభ్యులతో మాట్లాడారు. గ్రామ రైతు సంఘం సభ్యులు మాట్లాడుతూ ప్రతినెల సంఘాల ప్రతినిధులు కలిసి కట్టుబాట్లు ఏర్పాటు చేసుకొని క్రమం తప్పకుండ సమావేశం నిర్వహిస్తు న్నామని, సంఘాల తరపున హాజరైన ప్రతినిధులు అందరం కలిసి ఒక ఎజండా ఏర్పాటు చేసుకొని మీటింగ్‌లో సంఘాల పనితీరు, విత్తనాలు, ఎరువులు పురుగు మందులు మరియు వ్యవసాయ పనిముట్ల గురించి మరియు రైతు సభ్యులకు కావాల్సిన వ్యవసాయ అవసరాల గురించి చర్చిస్తామని, గ్రామా రైతు సంఘంలో పొదుపులు కూడా చేస్తున్నామని తెలిపారు. మరియు ప్రతినెల సమావేశంతో పాటుగా సంవత్సరానికి ఒకసారి అంతర్గత ఆడిట్ నిర్వహించి, వార్షిక మహాసభని కన్నుల పండుగాగా చేస్తున్నామని తెలిపారు.

గ్రామంలోని రైతులందరినీ ఈవిధంగా సంఘాల ద్వారా సంఘటిత పరచటానికి ఏపిమాస్ వారి శిక్షణలు మరియు నిరంతర సాంకేతిక సహకారం ఎంతైనా దోహదపడినదని తెల్పినారు. రాబోవు రోజులలో గ్రామా రైతు సంఘం ద్వారా రైతులకు వారి అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు తయారు చేసి కార్యక్రమాలు చేస్తామని తెల్పినారు. గ్రామ రైతు సంఘం పరిధిలో పని చేస్తున్న రైతు మిత్ర మరియు పుస్తక నిర్వాహకులతో కుడా మాట్లాడి వారు సంఘాల, సభ్యుల కోసం చేస్తున్న పనిగురించి తెలుసుకున్నారు.

తదుపరిగా ధరణి రైతు ఉత్పత్తిదారుల సంస్థ సభ్యులతో, సిబ్బందితో సమావేశమై, యఫ్.పి.ఓ ద్వారా చేస్తున్న కార్యక్రమాలను తెలుసుకున్నారు. ప్రస్తుతం యఫ్.పి.ఓలో



10 పంచాయతిలలో నుండి 808 మంది వాటాదారులు ఉన్నారని రాబోవు మూడు నెలలలో దాదాపు ఇంకా 200 మంది సభ్యులను చేసి వెయ్యిమందికి పైగా సభ్యులు అయ్యేలాగా చేస్తామని తెలిపారు. మరియు ఈ సంవత్సరంలో అదనంగా వెయ్యి రూపాయల చొప్పున ప్రతి సభ్యులు వాటాధనం పెంచుకుంటామని చెప్పినారు.

ప్రతినెల బోర్డు సభ్యులు సమావేశం, ప్రతి మూడు నెలలకు ఒకసారి గ్రామ రైతు సంఘాల ప్రతినిధుల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెల్పినారు. మరియు సభ్యులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు పురుగు మందులు అన్నియు ధరణి రైతు సేవా కేంద్రం ద్వారా అమ్మకం చేస్తున్నట్లు తెల్పినారు.

దాదాపు గడచిన సంవత్సరంలో ఎనభై లక్షల టర్నోవర్ జరిగిందని తెల్పినారు. మరియు ఈ సంవత్సరం రబీ, ఖరీఫ్ సీజన్లో తెలంగాణా మార్క్ ఫెడ్ వారిద్వారా రెండు మక్కజొన్న కేంద్రాలను పొందినామని, మరియు సివిల్ సప్లయ్ ద్వారా రెండు వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసుకొని రైతులు పండించిన పంటలను ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేసినామని, తద్వారా రైతులకు వ్యాపార సేవలు అందిచామని దీనిద్వారా లాభాలను కుడా పొందినామని తెల్పినారు. రైతు సేవా కేంద్రం ద్వారా వ్యవసాయ పనిముట్లను కిరాయికి ఇస్తున్నామని తెల్పినారు. బోర్డు సభ్యులే కమిటిలుగా ఏర్పడి బాధ్యతలు తీసుకొని, స్వయం నియంత్రణ ఉద్యమం కార్యక్రమాలను ఏపిమాస్ సిబ్బంది సహకారంతో యఫ్.పి.ఓలో జరుగుతున్నాయని తెలినారు.

భవిష్యత్ ప్రణాళిక గురించి వారు మాట్లాడుతూ సదాశివనగర్ మండలలంలో పత్తి ఎక్కువ పండుతున్నదని వారికి పత్తి జిన్నింగ్ మిల్లు, గోదాము, హార్వెస్టర్ లాంటివి ఏర్పాటు చేయటం కోసం ప్రణాళికలు చేస్తున్నామని ఇందుకోసం ఏపిమాస్ సాంకేతిక సహకారంతో ప్రణాళికలు తయారు చేస్తున్నామని బోర్డు సభ్యులు తెలిపారు.

క్షేత్ర సందర్శనకు వచ్చిన బోర్డు సభ్యులు మాట్లాడుతూ ధరణి యఫ్.పి.ఓ ద్వారా రైతులకోసం ఇంత చక్కని కార్యక్రమాలు చేయటం అభినందించదగిన విషయమని, దినదినాభివృద్ధి దిశలో పయనిస్తున్న ధరణి యఫ్.పి.ఓ ని చూసి తాము ఎన్నో కొత్త విషయాలను నేర్చుకున్నామన్నారు.

క్షేత్ర సందర్శనకు వచ్చిన పీస్ స్వచ్ఛంద సంస్థ చైర్మెన్ శ్రీ నిమ్మయ్య , గ్రామ వికాస స్వచ్ఛంద సంస్థ చైర్మెన్ శ్రీ స్వామి మాట్లాడుతూ ఇంత చక్కని క్షేత్ర సందర్శన ఏర్పాటు చేసిన ఏపిమాస్ వారికి, ధరణి యఫ్.పి.ఓ వారికీ ధన్యవాదములు తెలుపుతూ, ధరణి యఫ్.పి.ఓ రాష్ట్రం లోనే కాదు దేశంలో కూడా ఒక ఆదర్శ సంస్థగా తయారు అవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ధరణిలో చాలా విషయాలు నేర్చుకున్నామని తాము సహకారం అందిస్తున్న యఫ్.పి.ఓలలో కూడా ఇలాంటి చక్కని కార్యక్రమాలు చేపడతామని తెలుపుతూ ధరణి యఫ్.పి.ఓ సభ్యులకు, ఏపిమాస్ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.


అనంతరం ధరణి యఫ్.పి.ఓ ద్వారా నిర్వహిస్తున్న యఫ్.డి.సి, రైతు సేవా కేంద్రంలను సందర్శించి ఎంతో సంతోషాన్ని వ్యక్తంచేశారు. ఈ క్షేత్ర సందర్శనలో ధరణి బోర్డు సభ్యులతో పాటు రైతు మిత్రలు, ఏపిమాస్ ప్రధాన కార్యాలయం నుండి శ్రీ జి. శ్రీనివాస్, కామారెడ్డి మాస్ సిబ్బంది ఆర్. తిరుపతిరెడ్డి, టి.అమృతరాణి పాల్గొన్నారు. ■



# ఆన్‌లైన్‌లోనే సహకార సంఘాల రిజిస్ట్రేషన్ !

**ఆం**ధ్రప్రదేశ్‌లో రైతు ఉత్పత్తిదారుల సంఘాలను (ఎఫ్ పి ఓ లను) సహకార సంఘాల చట్టం క్రింద నమోదు చేసుకోవాలంటే, ఇప్పటివరకు ఉపవిధులు మొదలగు సంబంధిత పత్రాల ప్రతులను 4 సెట్లు చేసి రిజిస్ట్రేషన్ ఆఫీసుకు సమర్పించే వాళ్ళం. కోవిడ్ 19 వచ్చినప్పటి నుండి సహకార సంఘాల రిజిస్ట్రేషన్ కూడా ఆన్‌లైన్ లోనే చేసికొను అవకాశము కల్పించబడినది. ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ చేసుకొను దశలవారీ విధానాన్నిగురించి తెలుసుకుందాం.

మొదట ____.______________.____ కు వెబ్‌సైట్ లో 'కోఆపరేషన్ డిపార్టమెంట్ ' అనే దానిపైన క్లిక్ చేస్తే ప్రక్కనున్న స్క్రీన్ కనిపిస్తుంది. ఇందులో కుడివైపున, అప్లికెంట్ రిజిస్టర్, అప్లికెంట్ లాగిన్, డిసిఓ లాగిన్, డిఎల్‌సిఓ లాగిన్ కనిపిస్తుంది. మనము 'అప్లికెంట్ రిజిస్టర్' పైన క్లిక్ చేయాలి




అప్లికెంట్ రిజిస్టర్ క్లిక్ చేయగానే 'అప్లికెంట్ రిజిస్ట్రేషన్' స్క్రీన్ వస్తుంది. దానిని జాగ్రత్తగా నింపిన తరువాత మీరు ఇచ్చిన మొబైల్ నంబరుకు ఓటిపి వస్తుంది, దానిని ఎంటర్ చేస్తే, మీరు ఇచ్చిన మొబైల్ నంబరుకు, అప్లికెంట్ లాగిన్ కొరకు యూసర్ నేమ్ , పాస్ వర్డ్ వస్తుంది. సాధారణంగా, యూసర్ నేమ్ మీ మొబైల్ నంబరు, పాస్ వర్డ్ కో ఆపరేటివ్ ఉంటుంది.

యూసర్ నేమ్ , పాస్‌వర్డ్ ఎంటర్ చేస్తే, తరువాత స్క్రీన్లో అప్లికెంట్ 'ఇండివిడ్యుల్ / సొసైటీ ' పైన క్లిక్ చేసి, డ్రాప్ డౌన్‌లో ఇండివిడ్యువల్‌ను సెలెక్ట్ చేసికొని అప్లికెంట్ వివరాలు నింపాలి. అన్నీ నింపిన తరువాత 'సేవ్ అండ్ నెక్ట్స్' పైన క్లిక్ చేయాలి.

తర్వాత స్క్రీన్లో సొసైటి వివరాలు వస్తాయి. వాటిని జాగ్రత్తగా చదివి, సొసైటి పేరును నింపిన తరువాత 'సబ్మిట్ ఫర్ టైటిల్ అప్రూవల్ ' పైన క్లిక్ చేయాలి. ఇది డిసిఓ లాగిన్‌కు వెళుతుంది. మనము నమోదు చేసుకున్న పేరు ఇప్పటివరకు ఎవరు నమోదు చేసుకోనట్లైతే, డిసిఓ మన సహకార సంఘం పేరును అప్రూవ్ చేస్తారు. ఈ పేరు ముందే రిజిస్టర్ అయి ఉంటే రిజెక్ట్ చేస్తారు. రిజెక్ట్ చేస్తే, మనము మళ్ళీ క్రొత్తగా నమోదు చేసుకోవాలి. అప్రూవ్ అయినదో / రిజెక్ట్ అయినదో మనము డాష్ బోర్డు లోని టైటిల్ రెజిస్ట్రేషన్ స్టేటస్‌లో చూసుకోవాలి.

ఇంతటితో పేరు నమోదు పూర్తవుతుంది. సొసైటి రిజిస్ట్రేషన్ కొరకు మనము క్రింది డాక్యుమెంట్స్ తయారుచేసుకొని, స్కాన్ చేసి ఉంచుకోవాలి.


1. **సొసైటి బైలా (ఉపవిధులు) తయారు చేసుకోవాలి**
2. వ్యవస్థాపకులను, ఒక ముఖ్య వ్యవస్థాపకుణ్ణి ఎన్నిక చేసికొని, తీర్మానాన్ని సమావేశ పుస్తకములో వ్రాయాలి
3. అలాగే ఏ బ్యాంక్ నందు సొసైటి ఖాతా తెరవాలో నిర్ణయించుకొని తీర్మానమును సమావేశ పుస్తకములో వ్రాసి ఉండాలి.
4. వ్యవస్థాపకుల నుండి వాటాధనము సభ్యత్వ రుసుము వసూలు చేసికొని, పైన అనుకున్న బ్యాంక్ నందు సొసైటి పేరున కానీ, లేదా సస్పెన్స్ ఖాతాను కానీ తెరచి అందులో వేసి, ఆ డిపాజిట్ స్లిప్పును ఉంచుకోవాలి.
5. వ్యవస్థాపకుల అందరినుండి వ్యక్తిగత ధృవీకరణ పత్రములు, వారి నివాస ధృవీకరణ పత్రములు (ముఖ్యంగా ఆధార్‌కార్డు) నకలు పత్రమును తీసుకొనవలెను.
6. మసూద పత్రములో వ్యవస్థాపకుల వివరములను నింపి వారి అందరి సంతకములను తీసికోవాలి.

సమాన భావం ఉన్న స్నేహమే కలకాలం నిలబడుతుంది

7. ఫారం 'ఏ' ను నింపాలి.

సొసైటి ఏర్పాటు ఉద్దేశములు, బైలా అందరి వ్యవస్థాపకులతో ఒకసారి చర్చించి, అన్ని పత్రములపైనా ముఖ్య వ్యవస్థాపకుల సంతకము, సీలు ఉండాలి. వీటిని అన్నింటిని స్కాన్ చేసి ఉంచుకోవాలి.

- సొసైటి రెజిస్ట్రేషన్ కొరకు మళ్ళీ లాగిన్ అయి, 'డిటైల్స్ ఆఫ్ మెంబర్స్' పైన క్లిక్ చేసి, వ్యవస్థాపకుల పేర్లు వివరములు నమోదు చేయాలి. ఒకరి పేరు అయిన తరువాత 'యాడ్ మెంబర్' పైన క్లిక్ చేసి మరొక వ్యవస్థాపకుల పేర్లు , వివరములు నమోదు చేయాలి. ఇలా 12 మంది పేర్లను నమోదుచేసి, 'అప్‌లోడ్' పైన క్లిక్ చేయాలి.
- తరువాత మనము ముందుగానే స్కాన్ చేసికొని ఉన్న అన్ని పత్రములను వరుసగా అప్ లోడ్ చేయాలి. అప్ లోడ్ పూర్తి అయిన తరువాత చివరిలో 'ఎంటర్ రిజిస్ట్రేషన్ ఫీజ్' నందు, అధీకృత మూలధనములో ఒక శాతము లేదా గరిష్టముగా 10,000 రూపాయలను రెజిస్ట్రేషన్ ఫీజ్ నమోదుచేసి 'సబ్మిట్' కొట్టాలి. రెజిస్ట్రేషన్ ఫీజు ఆన్ లైన్ లో చెల్లించాలి. అలాగే ఇ ఎఫ్ ఎం ఎస్ ద్వారా డిసిఓ పేరుతో 200 రూపాయల చలాన ఆన్‌లైన్ లోనే చెల్లించాలి.


Government of Andhra Pradesh
Department of Cooperation

Certificate of registration under section 5 of the Andhra Pradesh
Mutually Aided Cooperative Societies Act, 1995

(GIVEN UNDER MY HAND AND SEAL THIS )

- ఈ ప్రక్రియ పూర్తి అయిన తరువాత డి సి ఓ ఆఫీసు నుండి ఒక సీనియర్ ఇన్‌స్పెక్టర్ మన సహకార సంఘాన్ని సందర్శించి, వ్యవస్థాపకులతో సమావేశమై, సహకార సంఘం ఆవశ్యకతపై చర్చించి, సంతృప్తి చెందినచో డిసిఓకు ఫీస్‌బిలిటీ పత్రాన్ని సమర్పిస్తారు. డిసిఓ గారు మనకు సొసైటి రిజిస్ట్రేషన్ పత్రాన్ని ఆన్ లైన్ లోనే పంపిస్తారు. మనము డాష్ బోర్డు లోని సొసైటి రిజిస్ట్రేషన్ స్టేటస్‌లో చూసి సొసైటి రిజిస్ట్రేషన్ పత్రాన్ని డౌన్లోడ్ చేసికొనవలయును.

సందేహాల నివృత్తి కోసం, సలహాలకోసం ....

9440800622కు ఫోన్ చేయవచ్చు. ■

## కాఫీ పొడిని ఇలా కూడా వాడవచ్చు !

***కాఫీ** చాలామంది ఫేవరేట్ డ్రింక్. అయితే కాఫీ పొడితో ఇతర ప్రయోజనాలు కూడా ఉన్నాయి. అవేమిటంటే...*

- కాఫీ గింజలను మెత్తగా పొడిచేసి చర్మానికి స్క్రబ్‌గా వాడితే చర్మంలోని టాక్సిన్లన్నీ పోయి మృదువుగా తయారవుతుంది.
- కాఫీ గింజలను పొడి చేసి గాలిపోయే పల్చటి గుడ్డలో పోసి పెడితే మంచి ఎయిర్ ఫ్రెష్‌నర్‌గా పనిచేస్తుంది.
- కాఫీ గింజల్లో కొద్దిగా నీళ్లు పోసి పేస్టులా చేయాలి. బ్రౌన్ కలర్‌లో ఉన్న ఆ పేస్టును ఆర్ట్ ప్రాజెక్టులో రకరకాల షేడ్స్ కోసం వాడొచ్చు.
- వాడేసిన కాఫీ పొడిని కప్పులో పోసి ఫ్రిజ్‌లో పెడితే ఫ్రిజ్ నుంచి దుర్వాసన రాదు. సువాసన వస్తుంది.



- చాకొలేట్ డెజర్టుల మీద కాఫీ పొడిని చల్లితే మంచి సువాసన వస్తుంది. యమ్మీగా కూడా ఉంటుంది.
- మోల్టెన్ వ్యాక్సులో కాఫీపొడి కలిపి ఆ మిశ్రమాన్ని మూసలో పోసి, గట్టిపరిస్తే కాఫీ క్యాండిల్స్ రెడీ.
- కాఫీ పొడి మంచి స్క్రబ్బర్ కూడా. దీంతో గిన్నెలపై, ప్యాన్లపై ఏర్పడ్డ నల్లమచ్చలను పోగొట్టవచ్చు. ■

చెలిమిని మించిన కలిమి లేదు, సంతృప్తిని మించిన బలిమి లేదు

# వాష్ రిసోర్స్ పర్సన్లకు క్షేత్ర స్థాయి శిక్షణ

– ఎల్. భవాని

అనంతపురం జిల్లాలోని పామిడి, కల్యాణదుర్గం పట్టణాలలో మెప్మా వారి సహకారంతో క్షేత్ర స్థాయి ఆర్ పి లకు (రిసోర్స్ పర్సన్లకు) వాష్ అంశాలపైన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాలను జనవరి 19, 20 తేదీలలో నిర్వహించారు. పామిడిలో స్థానిక టిఎల్ఎఫ్ భవనంలో మొత్తం 25 మంది వాష్ ఆర్పి లకు 19న , కల్యాణదుర్గంలో 20న స్థానిక గీత జ్ఞాన మందిరం భవనంలో 30 మంది వాష్ ఆర్పి లకు శిక్షణ పొందారు.

శిక్షణలో భాగంగా వాష్ ప్రాముఖ్యత, ప్రస్తుత కరోనా సమయంలో నీరు, పారిశుధ్యం, పరి శుభ్రతల అవసరాల గూర్చి, వాష్ అంశాలను సరిగా పాటించకపోతే మహిళలు ఎలా ప్రభావితమవుతారు ? వాష్ అలవాట్లను ఎలా మెరుగుపరుచుకోవాలి అని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఏపిమాస్ 'వాష్ ప్రాజెక్ట్' మేనేజర్ శ్రీ ఎల్.భవాని ఆర్ పి లకు వివరించారు. వాష్ అంశాలు లోపిస్తే ఎలాంటి వ్యాధులు ప్రబలుతాయి అనే విషయాలపై సభ్యులకు ఆటల ద్వారా వివరించారు.

ఈ శిక్షణ కార్యక్రమానికి పామిడి మునిసిపల్ కమీషనర్ శ్రీ అనుపమ గారు హాజరయ్యారు. అనంతపురం జిల్లాలో పైలట్గా వాష్ ప్రోగ్రాం నిర్వహిస్తున్న ఏపిమాస్ సంస్థ, మొట్టమొదటగా పామిడి పట్టణాన్ని ఎంచుకున్నందుకు సంస్థకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఆర్ పిలు వాష్ అంశాలపై శిక్షణ తీసుకున్న తరువాత తాము తెలుసుకున్న విషయాలను తమ చిన్న సంఘాల మీటింగ్లలో తెలపాలని, అలాగే మీటింగ్ సమయంలో వాక్సిన్ వేసుకున్నా కరోనా జాగ్రత్తలు పాటించాలి అని తెలిపారు. ఏపిమాస్ ఆధ్వర్యంలో పామిడిలో వాష్ కార్యక్రమాన్ని తప్పక విజయవంతం చేస్తామని తెలిపారు. అనంతరం జిల్లా కో ఆర్డినేటర్ శ్రీ వర్ధన్ మాట్లాడుతూ ప్రతి చిన్న, పెద్ద సంఘాల మీటింగ్లలో వాష్ని ఒక ఎజెండా పాయింట్ లాగా పెట్టుకుని ఆ విషయాలపై మహిళల్లో అవగాహన కలిగించాలని, అలాగే వాష్ ఉత్పత్తులను గురించి, మరుగుదొడ్డి ఉపయోగాలను గురించి మరింతగా సంఘ సభ్యులకు విశదీకరించాలని తెలిపారు. శిక్షణకు జిహెచ్ఎంసి కోఆర్డినేటర్ రాణి గారు హాజరయ్యారు. హైదరాబాద్ జిహెచ్ఎంసిలో తామెలాంటి వ్యూహాలతో వాష్ కార్యక్రమాలను అమలు చేసున్నదీ తెలిపారు. అవి పామిడిలోకూడా పాటించాలని సూచించారు. భవానిగారు మాట్లాడుతూ ఆర్పిలు వాష్ ప్రోగ్రాంలో ముఖ్య పాత్ర పోషిస్తారని, వారు అనుకుంటే తక్కువ సమయంలో ఎక్కువమంది మహిళలకు వాష్ విషయాలపై సమాచారం అందుతుందని, కాబట్టి శిక్షణ పొందిన ఆర్పిలు ప్రతి సంఘ సమావేశాల్లో కేవలం అప్పులు, వసూళ్ళఅంశాలే కాకుండా వారి ఆరోగ్యానికి సంబందించిన విషయాలను కూడా చర్చించేలా శ్రద్ధవహించాలని తెలిపారు.

అనంతరం పామిడి మెప్మా టిఎంసి శ్రీ చంద్రశేఖర్ ఏపిమాస్ ఇంతకుముందు పామిడిలో చేసిన కార్యక్రమాల గురించి వివరించి, పామిడిని వాష్ పైలట్ మండలంగా తీసుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆర్పి లకు వాష్ పైన తగు సూచనలు ఎప్పటికప్పుడు అందిస్తామని, అలాగే వాష్ ఉత్పత్తుల వాడకం పైన మహిళా సంఘ సభ్యులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తామని అన్నారు. శిక్షణకు విచ్చేసిన ఆర్పి లు వాష్ ప్రతిజ్ఞ చేశారు. టిఎంసి చంద్రశేఖర్ గారి ధన్యవాదాలతో శిక్షణ కార్యక్రమం ముగిసింది.

**కల్యాణదుర్గంలో ...**

కల్యాణదుర్గంలో 20న ఒకరోజు శిక్షణా కార్యక్రమంలో భాగంగా, వాష్ ఆర్పి లకు ఆటలు, ఉపన్యాసం, ఫ్ల కార్డుల ద్వారా వాష్ అంశాల గురించి అవగాహన కల్పించడం జరిగింది. నీరు, పారిశుధ్యం పరిశుభ్రత అంశాలు, ప్రస్తుత సమయంలో వాటి ప్రాముఖ్యత గురించి రాణి గారు సవివరంగా ఆర్పిలకు తెలిపారు. పట్టణంలోని 1000 సంఘాలకు వాష్ పైన అవగాహన కల్పిస్తామని సభ్యులంతా ప్రతిజ్ఞ చేశారు.

చిత్తశుద్ధి, పట్టుదల, ఓర్పు కార్యసిద్ధికి ఆవశ్యకం; వీటిని మించి చేసే పనిని ప్రేమించడం మరింత ఆవశ్యకం

వాష్ ప్రాజెక్ట్ మేనేజర్ భవాని గారు ఎఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో జరుగుతున్న సస్య మిత్రల ఇండక్షన్ ట్రైనింగ్‌లో పాల్గొని వారికి కూడా వాష్ విషయాల పట్ల అవగాహన కల్పించారు. అలాగే పామిడిలోని వెలుగు యానిమేటర్లకు, శ్రీ వాణి కాలేజీ ప్రిన్సిపాల్ విద్యార్థులకు వాష్ ఉద్దేశం గురించి మాట్లాడుతూ వారి సహకారంతోనే ఎక్కువమందికి వాష్ అంశాలు క్షేత్రస్థాయి వరకు చేరతాయని ఈ ప్రోగ్రాంకి సహకరించాలని కోరారు.

వాష్ ప్రోగ్రాం విజయవంతం కావడానికి స్థానిక ఎన్‌జిఓ ల సహకారం అవసరం అన్న ఉద్దేశంతో ఏపిమాస్ ప్రతినిధులు ఆర్‌డిటి సంస్థ హాబిటాట్ మేనేజర్ శ్రీ రాజశేఖర్ రెడ్డిని కలిసి వారి సహకారం కోరారు.

తమకున్న వివిధ క్లస్టర్ స్థాయిలలో వాష్ పైన అవగాహన కార్యక్రమాలను ఉమ్మడిగా నిర్వహించడానికి శ్రీ రాజశేఖర్ రెడ్డి సంసిద్ధత తెలిపారు. ■

## ముఖ వర్చస్సును, శిరోజాల ఆరోగ్యాన్ని పెంచే కొబ్బరి పాలు

**కొ**బ్బరిపాలను ఉపయోగించడం వల్ల వెంట్రుకలు ఆరోగ్యంగా ఉంటాయి. కొబ్బరి పాలలోని కొవ్వు, ప్రొటీన్లు, ఐరన్, సోడియం, భాస్వరం, పొటాషియంలు కురులను పటిష్టంగా ఉంచుతాయి.

- ❑ కొబ్బరిపాలలో బి12, జింక్ వంటి పోషకపదార్థాలు ఉన్నాయి. ఇవి తలలో రక్తప్రసరణను మెరుగు పరుస్తాయి. జుట్టు సమస్యలు తగ్గి శిరోజాల పెరుగుదలకు తోడ్పడతాయి.
- ❑ కొబ్బరిపాల వల్ల జుట్టు ఊడడం తగ్గుతుంది. వెంట్రుకలు చిట్లిపోవు. పైగా పొడిజుట్టును నివారిస్తుంది.
- ❑ చుండ్రు నుంచి రక్షిస్తుంది. బట్టతల రాకుండా కాపాడుతుంది.
- ❑ జుట్టులోని ప్రొటీన్లు పోకుండా కొబ్బరిపాలు సహాయపడతాయి. అంతేకాదు అతినీలలోహిత కిరణాల వల్ల శిరోజాలు దెబ్బతినకుండా కొబ్బరిపాలు కాపాడతాయి.
- ❑ జుట్టు పెరగడానికి కొబ్బరిపాలను నేరుగా జుట్టుకు పట్టించవచ్చు. పావు కప్పు కొబ్బరిపాలను గోరువెచ్చగా వేడిచేసి పదిహేను నిమిషాలపాటు మసాజ్ చేయాలి. ఆ తర్వాత షాంపుతో స్నానం చేయాలి. వారానికి ఒకసారి ఇలా చేయడం వల్ల మంచి ఫలితం కనిపిస్తుంది.
- ❑ నిమ్మరసంలో సి విటమిన్ ఉంటుంది. దీన్ని కొబ్బరిపాలలో కలిపి తలకు మసాజ్ చేసుకుంటే కూడా వెంట్రుకలు బాగా పెరుగుతాయి. అంతేకాదు జుట్టు రాలడం తగ్గుతుంది.
- ❑ పొడిబారిన జుట్టుకు కొబ్బరి పాలను పట్టిస్తే జుట్టు పట్టులా తయారవుతుంది. వెంట్రుకలు చిట్లడం తగ్గుతుంది.
- ❑ జుట్టుకు కండిషనర్‌లా కొబ్బరిపాలు ఉపయోగపడతాయి. షాంపుతో తలస్నానం చేశాక కొద్దిగా కొబ్బరిపాలను తలకు పట్టించి రెండు నిమిషాలు అలాగే ఉంచుకుని ఆ తర్వాత నీటితో వెంట్రుకలను శుభ్రంగా కడిగేసుకోవాలి.
- ❑ ఒక టీ స్పూన్ కొబ్బరి పాలకు, రెండు టీస్పూన్ల కొబ్బరి నూనెను కలిపి దానితో ముఖానికి మసాజ్ చేసుకుని దూదితో తుడిచేసుకోవాలి. చర్మం జిడ్డుగా, మొటిమలతో ఉంటే ఇలా నూనెలో కొబ్బరిపాలు కలిపి వాడడంతో చర్మంలోని బాక్టీరియా పోతుంది.
- ❑ చర్మం ముడతలు రాకుండా, వయసు కనిపించకుండా చర్మాన్ని మృదువుగా, పట్టులా ఉండేలా కొబ్బరిపాలు చేస్తాయి. బాదంపొడి, తేనె, కొబ్బరిపాలు కలిపి ఆ మిశ్రమాన్ని ముఖానికి పట్టించుకుని రెండు నిమిషాల తర్వాత ముఖాన్ని కడిగేసుకోవాలి. ఇలా చేస్తే చర్మం మృదువుగా తయారవుతుంది. ■

**జీవితం పోరాటాల, భ్రమల పరంపర ; జీవిత పరమార్థం సుఖపడడంకాదు, అనుభవాలద్వారా నేర్చుకోవడం**

# 'స్త్రీ నిధి'లో డిపాజిట్లు, రుణ పథకాలు

స్త్రీనిధి ఒక సహకార సంస్థ కావున సభ్యుల భాగస్వామ్యం ఎక్కువగా ఉండాలి. స్త్రీనిధిలో స్వంత వనరులను అనగా పొదుపులను మరియు వాటాధనమును క్రమంగా పెంచి ఆర్థిక పరపతి సాధించాలి. అప్పునిల్వలో ప్రస్తుతము వాటాధనము 6%, సభ్యుల నుండి పొదుపులు 20% మరియు బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలు 74%గా ఉన్నవి. స్త్రీనిధిలో సభ్యుల వాటాధనము ఎంత ఎక్కువ ఉంటే అంత ప్రయోజనం. అందుకని ఒక సభ్యురాలు పొందే రుణము మొత్తముపై న 2% ను, తమ తమ మండల/ పట్టణ సమాఖ్యలు స్త్రీ నిధిలో వాటాధనము చెల్లించటానికి జమ చేస్తారు. ఈ మొత్తాన్నిసభ్యులకు స్త్రీనిధి అదనపు రుణంగా అందచేస్తుంది. ఈ విధంగా చేయటం వలన స్త్రీనిధిలో సంఘాల/సమాఖ్యల భాగస్వామ్యంపెరగటమే కాకుండ, స్త్రీనిధి వాటాధనము పెరిగి బ్యాంకుల నుండి ఎక్కువ మొత్తములో రుణాలు తెచ్చిసభ్యులకు ఎక్కువ రుణాలు అందించుటకు అవకాశముంటుంది. ఈ విధంగా చెల్లించిన వాటాధనముపై, ప్రతి సంవత్సరము ప్రకటించిన మేరకు సభ్యురాలికి డివిడెండ్ చెల్లిస్తుంది. కావున రుణం పట్ల కట్టే వడ్డీ కంటే డివిడెండు ఎక్కువ రావడం వలన సభ్యురాలికి ఎలాంటి ఆర్థిక భారము ఉండదు.

ఉదాహరణ: ఒక సభ్యురాలు 25,000/- రూపాయల రుణం పొందినప్పుడు 2% అనగా రూ.500/- జమ చేయాలి. ఈ అదనపు రుణం తిరిగిచెల్లించే కాలవ్యవధి 24 నెలలు. ఇందుకుగాను సభ్యురాలు రెండు సంవత్సరాలకు చెల్లించే వడ్డీ మొత్తంరూ.67/- (అప్పురూ. 500/-లకు 24 నెలలకు 12.50% వడ్డీ చొప్పున, 24 నెలలు మొత్తం రూ. 567/- చెల్లిస్తారు). రూ.500/- వాటాధనముపై స్త్రీనిధి, డివిడెండ్ రూపములో సభ్యురాలికి గత సంవత్సరానికి ఇచ్చిన 11% ప్రకారం రెండు సంవత్సరాలకు కలిపి రూ.110/- చెల్లిస్తుంది. అందువల్ల సభ్యులు రూ.43/-ను అదనంగా లాభం పొందుతారు. అంతేగాక డివిడెండ్ క్రమంగా పెరిగే అవకాశం ఉంది. సభ్యురాలు సమకూర్చే మొత్తాన్ని 6 సంవత్సరాలు పూర్తి అయిన తరువాత, డివిడెండ్‌తో పాటుగా ఆ సభ్యురాలి ఖాతాకు చెల్లించడం జరుగుతుంది. ఇట్టి వివరాలు స్త్రీనిధి వెబ్‌సైట్లో సభ్యులు చూసుకోవచ్చును. ప్రత్యేక పరిస్థితులలో అనగా మెంబరు చనిపోయినట్లయితే లేక సంఘం నుండి వెళ్ళిపోతే వారికి ఆ మొత్తం తిరిగి ఇస్తారు.

**స్త్రీనిధిలో పొదుపులు , వాటిపై ఇచ్చే వడ్డీ వివరాలు**

స్త్రీనిధి ఒక సహకార సంస్థ. ఇందులో సభ్యులు మరియు అసోసియేట్ సభ్యుల (సంఘాలు) భాగస్వామ్యం తప్పనిసరి. బ్యాంకులు డిపాజిట్లు తీసుకొని అప్పులు ఇచ్చిన విధంగా స్త్రీనిధిలో సభ్యుల డిపాజిట్లు ఎంత ఎక్కువగా ఉంటే అంత బాగా సేవలు అందించవచ్చు. స్త్రీనిధిలో పెట్టిన డిపాజిట్లపై బ్యాంకుల కంటే ఎక్కువ వడ్డీని స్త్రీనిధి చెల్లిస్తుంది. స్త్రీనిధిలో ఉన్న డిపాజిట్ పథకాల వివరాలు:

**1. సమృద్ధి పథకం**

ఎ. సంఘాలు స్త్రీనిధిలో సమృద్ధి పొదుపు తప్పక చేయాలి. ఒక సంఘం నెలకు రూ.100/- చొప్పున 12 నెలలకు చెల్లించిన పొదుపులను రికరింగ్ డిపాజిట్‌గా ఒక సంవత్సరం వరకు వుంచి, ఆ తరువాత 5 సంవత్సరాల కొరకు ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా మార్చడం జరుగుతుంది. ఈ పొదుపుపై ఎస్ బి ఐ వడ్డీ రేటుకు సమానంగా వడ్డీ రేటు చెల్లిస్తారు. మరియు 6 సంవత్సరాల తర్వాత అసలు మరియు వడ్డీ కలిపి ఆయా స్వయం సహాయక సంఘాల బ్యాంకు ఖాతాలకు జమ చేయబడుతుంది.

బి. ఉజ్వల డిపాజిట్ :

స్వయం సహాయక సంఘాలు (ఎస్ హెచ్ జి) రూ.1000/- నెలకి చెల్లించాలి (ప్రతి నెల లేదా మూడు నెలలకి ఒక్కసారి లేదా ఆరు నెలలకి ఒక్కసారి కూడా చెల్లించవచ్చును). వడ్డీ రేటు 8.5% మూడు నెలలకు

ఒకసారి లెక్కించి చక్ర వడ్డీని సంవత్సరానికి ఒకసారి చెల్లించడం జరుగుతుంది. కాల పరిమితి 48 నెలలు ముగిసిన డిపాజిట్ మరియు వడ్డీ మొత్తాన్ని సంబంధిత సంఘాల ఖాతాలో జమ చేయబడును.

**సి. సంకల్పడిపాజిట్లు:**

గ్రామ / స్లమ్ సమాఖ్యలు స్త్రీనిధిలో కనీస మొత్తం రూ. 10,000/- లు మరియు మండల/ పట్టణ/జిల్లా సమాఖ్యలు కనీసం రూ. 50,000/- లు స్త్రీనిధిలో జమ చేయవచ్చు. ఈ డిపాజిట్ కాల వ్యవధి 3 సంవత్సరాలు. వడ్డీ రేటు ఎస్ బి ఐ ఇచ్చేవడ్డీ కంటే 1% అదనం. ప్రస్తుతం ఇచ్చే వడ్డీ రేటు 8%, లక్షపై నడిపాజిట్ ఉంటే ప్రతి నెల, రూ. లక్ష లోపు డిపాజిట్లకు మూడు నెలలకు ఒకసారి వడ్డీ చెల్లింపు చేయడం జరుగుతుంది.

**సి ఐ ఎఫ్ డిపాజిట్ పథకం**

మండల సమాఖ్య సి ఐ ఎఫ్ నిధులనుండి 75% స్త్రీనిధిలో సి.ఐ.ఎఫ్ కార్పస్ డిపాజిట్లుగా ఉంచడం ద్వారా మండల మరియు గ్రామ సమాఖ్యలు లాభపడతాయి. గ్రామ సంఘాలకు స్త్రీనిధి నుంచి వచ్చే వడ్డీ ఆదాయము నుండి సగం ఆదాయం పంచడం వలన గ్రామ సంఘాలు కూడా బలపడతాయి.

స్త్రీనిధిలో సి.ఐ.ఎఫ్ కార్పస్ డిపాజిట్ ఉంచడం వలన స్త్రీనిధి ఎక్కువ మొత్తంలో బ్యాంకుల నుండి అప్పు తెచ్చి మండల సమాఖ్య పెట్టిన డిపాజిట్‌కు కనీసం 10 రెట్లు ఎక్కువ మొత్తంలో సంఘాలకు రుణాలు అందించుటకు వీలవుతుంది. సంఘాలకిచ్చే రుణ మొత్తం పెరగటం వలన స్త్రీనిధి నుండి వచ్చేవడ్డీ మార్జిన్ (0.25%) మొత్తం కూడా పెరుగుతుంది.

అంతేకాకుండా సి.ఐ.ఎఫ్ ఆధారంగా అదనపు రుణ పరిమితి మండలానికి కేటాయించడం వలన అవసరమైన సభ్యులకు రుణాలు మంజూరు నిర్ణయాధికారం మండల సమాఖ్యకే ఉంటుంది. స్త్రీనిధి నుండి పొందే రుణాలకు ప్రభుత్వ నిబంధనల మేరకు వడ్డీ లేని రుణ పథకం (వి ఎల్ ఆర్) కూడా వర్తిస్తుంది. స్త్రీనిధి నుండి గ్రామ/స్లమ్ సమాఖ్యలకు ఆదాయం సంవత్సరానికి 1.25% వడ్డీ మార్జిన్ రూపకంగా వస్తుంది. ఈ ఆదాయం రుణ నిల్వలు పెరిగినప్పుడు పెరుగుతుంది. ఈ విధంగా వచ్చే ఆదాయం వలన గ్రామ/స్లమ్ సమాఖ్యలు ఆర్థికంగా బలోపేతం అయి సమర్థవంతంగా పనిచేస్తాయి.

**వివిధ రకాల రుణ పథకాలు , వాటిని పొందే విధానం**

'ఎ' మరియు 'బి' గ్రేడ్‌లలో ఉండే గ్రామ / స్లమ్ సమాఖ్యల పరిధిలో సువిధ రుణాలు రూ. 30,000 వరకు, ఇతర గ్రేడ్‌లలో ఉన్న గ్రామ/స్లమ్ సమాఖ్యల పరిధిలో ఉండే సభ్యులు రూ. 25,000 వరకు జీవనోపాదులకు మరియు వినిమయ ఉపయోగాలకు రుణాన్ని 48 గంటలలో పొందవచ్చును. జీవనోపాదులకు ప్రగతి రుణాలు (రూ.30,001 నుండి రూ.50,000 వరకు), అక్షయ రుణాలు (రూ.50,001 నుండి రూ.1,00,000 వరకు), సౌభాగ్య రుణాలను (రూ. 1,00,001 నుండి 3,00,000 వరకు) 15 రోజులలోపు పొందవచ్చు.

**ఎ. నిర్ణయాధికారం సంఘాలు, సమాఖ్యలదే**

- సంఘ సభ్యులకు కావలసిన రుణాలను సంబంధిత సంఘం, గ్రామ సంఘం/స్లమ్ సమాఖ్య స్థాయిలో అర్హతల ప్రకారం చర్చించి, రుణ మంజూరు గురించి తగు నిర్ణయము తీసుకోవాలి.
- సభ్యులకు స్త్రీనిధిఆర్థిక సేవలను విస్తరించడంలో, గ్రామ సంఘం/స్లమ్ సమాఖ్యలు స్త్రీనిధికిశాఖల మాదిరిగా మరియు మండల సమాఖ్యలు స్త్రీనిధికిప్రాంతీయ కార్యాలయాల మాదిరిగా పని చేసి సభ్యులకు కావలసిన సేవలు అందించటంలో తోడ్పడాలి.
- రుణ దరఖాస్తుమరియు సంబంధిత లోన్ డాక్యుమెంటేషన్ తర్వాతనే రుణం కొరకు దరఖాస్తుచేయాలి.

రుణ దరఖాస్తు చేయుటకు మరియు రుణం పొందుటకు ఎవరికి డబ్బు ఇవ్వనవసరం లేదు

**బి. రుణ పరిమితులు**

ప్రస్తుతము గ్రామ/స్లమ్ సమాఖ్యలు వాటి గ్రేడింగ్

మరియు ఇతర అంశాల ఆధారంగా గరిష్టంగా రూ. 72.00 లక్షల వరకు రుణ పరిమితి కలిగి ఉన్నాయి. అలాగే స్వయం సహాయక సంఘాలు ప్రస్తుతం గరిష్టంగా రూ. 3.75 లక్షల వరకు రుణ పరిమితిని కలిగి ఉన్నాయి. సౌభాగ్య రుణ పథకములో ఒక్క సభ్యురాలు రూ. 3.00 లక్షల వరకు అదనంగా రుణం పొందవచ్చును. సంఘ సభ్యుల సంఖ్య ఆధారంగా వివిధ రకాల రుణాలు పొందుటకు అర్హులైన కనిష్ఠ / గరిష్ఠ సభ్యుల సంఖ్య వివరాలు ఈ క్రింది పట్టికలో ఇవ్వడమైనది.

| ఎస్‌హెచ్‌జి | మొత్తం | కనిష్టం | గరిష్టం | కనిష్టం | గరిష్టం | ఎస్‌హెచ్‌జి గరిష్టంగా పొంద గలిగే అప్పు రూ. లక్షలలో |
|---|---|---|---|---|---|---|
| 14 ఆపైన | 11 | 4 | 7 | 4 | 7 | 3.75 |
| 12–13 | 9 | 3 | 6 | 3 | 6 | 3.00 |
| 10–11 | 8 | 2 | 6 | 2 | 5 | 3.00 |
| 7–9 | 6 | 2 | 4 | 2 | 4 | 2.00 |
| 5–6 | 4 | 2 | 2 | 2 | 2 | 1.50 |

**సి. రుణ పథకాలు:**

స్త్రీనిధి, సంఘాలకు / సమాఖ్యలకు మాత్రమే ఆర్థిక సేవలు అందించుటకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సంస్థ అయినందువలన, సభ్యుల ఆర్థిక అవసరాలకు అనుగుణంగా రుణ పథకాలను ఏర్పాటు చేసుకోవచ్చు. సుమారు 100 రకాల ఆదాయాభివృద్ధికార్యక్రమాల కొరకు మరియు స్మార్ఫోధన్, సై కిల్, ల్యాప్ టాప్, వ్యక్తి గత మరుగుదొడ్లు (ఐహెచ్‌హెచ్‌ఎల్) మొదలగు వాటి కొరకు రుణాలు పొందుటకు ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నది. రుణ పథకాల వారీగా కనిష్ఠ / గరిష్ఠ రుణ పరిమితి మరియు ఎన్ని వాయిదాలలో కట్టవలసిన వివరాలు ఈ క్రింది పట్టికలో పొందుపరిచాము.

**డి. పాడి పశువులకు రుణాలు:**

గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమను ప్రధాన జీవనోపాధి కార్యక్రమముగా గుర్తించి, పాడి గేదె/ఆవుల కొనుగోలు కొరకు స్త్రీనిధి ఒక ప్రత్యేక రుణ పథకాన్ని అమలు చేస్తూ, ఎక్కువ సంఖ్యలో సభ్యులకు ఇట్టి రుణాలను అందిస్తున్నది.

| రుణ పథకం | ప్రస్తుత రుణ మొత్తం (రూ) | రుణ ఉద్దేశ్యం | రుణ చెల్లింపు వాయిదాలు |
|---|---|---|---|
| సువిధ | 25000–30000 | ఇతర వినిమయ అవసరాలకు మరియు | 24–36 నెలలు |
| | | జీవనోపాధులు | 36–42 నెలలు |
| ప్రగతి | 25001–50000 | జీవనోపాధులు | 60 నెలలు |
| అక్షయ | 50001–100000 | జీవనోపాధులు | 60 నెలలు |
| డైరీ | 50000 వరకు | పాడిగేదెలు/ఆవులు కొనుగోలుకై | 48 నెలలు |

**ఇ. హెచ్ ఎల్ పి ద్వారా రుణాన్ని నిర్ధారించడం**

స్త్రీనిధిలో అందరు సభ్యులకు కాకుండా అవసరమైన సభ్యులకు మాత్రమే కుటుంబ జీవనోపాదుల ప్రణాళిక (హెచ్ఎల్‌పి) చేయబడుతుంది. సంఘ సభ్యురాలు అవసరమైన అప్పుపొందటానికిమొదట తన కుటుంబంలో చర్చించి సంబంధిత సంఘ సమావేశంలో రుణానికి అభ్యర్ధన చేయాలి. స్వయం సహాయక సంఘం ఈ రుణ అభ్యర్థనను పరిశీలించి గ్రామసంఘం/స్లమ్ సమాఖ్యకి సిఫారసు చేస్తుంది. ఆ సంఘం పనితీరును మరియు అర్హతలను పరిశీలించి సంఘ సభ్యుల అప్పు మంజూరు కొరకు గ్రామసంఘం / సమ్స్ సమాఖ్యలు స్త్రీనిధికి టాబ్లెట్ పి.సి. ద్వారా సభ్యురాలు, సంఘం లీడరు మరియు సాక్షులను ఆధార్/ఐరిస్‌తో ధృవీకరించి, రుణ దరఖాస్తు పెట్టాలి.

సభ్యురాలు లోను కొరకు అభ్యర్థన చేసిన తర్వాత స్త్రీనిధి సిబ్బంది సభ్యురాలు పని చేసే జీవనోపాధి గురించి సభ్యురాలు/కుటుంబ సభ్యులతో చర్చించి ఆ ప్రణాళికను టాబ్లెట్ పి.సి ద్వారా ఆఫ్/ఆన్ లైన్లో తయారు చేసి స్త్రీనిధికి పంపిస్తారు. వీటిని స్త్రీనిధి హెడ్ ఆఫీస్ మంజూరు చేసిన రుణ మొత్తాలను సంబంధిత సంఘాల సేవింగ్స్ ఖాతాకు విడుదల చేస్తారు. ఈ రుణాన్ని సాధ్యమైనంత త్వరగా

నచ్చిన పనిని మూర్ఖుడైనా గొప్పగా చేయగలడు, కాని ప్రతి పనినీ తనకు నచ్చే రీతిలో మలుచుకోవడమే వివేకి లక్షణం

సభ్యులకు ఇవ్వాలి. వీలును బట్టి ఈ రుణాలను సభ్యుల వారీగా వారి సేవింగ్స్ ఖాతాకు జమ చేస్తారు.

**స్త్రీనిధి రుణవాయిదాల చెల్లింపులు:**

నిర్ణయించిన వాయిదాల ప్రకారం రుణం పొందిన సభ్యులు సంఘ సమావేశంలో అప్పు వాయిదాను చెల్లించాలి. గ్రామ/స్లమ్ సమాఖ్యల యొక్క సమావేశం తేదీ నాటికి సభ్యురాలి వారీగా వసూలు కావలసిన నెలసరి సమాన వాయిదా (ఇఎమ్ఐ) మరియు గత నెల బకాయి ఏదైనా ఉన్నట్లయితే దానిని కూడా కలిపి మొత్తం చెల్లించవలసిన డిమాండ్ (టు బి పెయిడ్) మాత్రమే స్వయం సహాయక సంఘాలు వసూలు చేయాలి. ఈ వివరాల కొరకు గ్రామ/స్లమ్ సమాఖ్యల వద్ద ఉన్న టాబ్లెట్ పి.సి.లో స్త్రీనిధి డి.సి.బి. రిపోర్టులో ప్రతి నెల చూసి నిర్ధారించుకోవాలి.

**సంఘ సభ్యులు సంఘంలో చెల్లించిన రుణ వాయిదాలనుసంఘం నుండి మాత్రమే స్త్రీనిధి ఖాతాకు బదిలీ చేయాలి.** స్వయం సహాయక సంఘం వారిగా తిరిగి చెల్లించిన అప్పు వాయిదాలను సభ్యురాలి వారిగా గ్రామ/స్లమ్ సమాఖ్య వారు, స్త్రీనిధి సిబ్బంది ద్వారా సర్దుబాటు అయ్యే విధంగా చూసుకోవాలి, ఇందుకు వివిఎల్ఇ సేవలను కూడా ఉపయోగించుకొనవలెను.

**సంఘాలు , సమాఖ్యల పర్యవేక్షణ బాధ్యత**

సంఘాలు మరియు సమాఖ్యలు అవసరమున్న వారికి అప్పులిచ్చి, ఇచ్చిన అప్పు సద్వినియోగం అయ్యేలా చూడాలి. సంఘాల పుస్తకాలలో ఈ వివరాలు నమోదు చేయాలి. మెంబర్లకులోను కార్డులో వివరాలు వ్రాసి ఇవ్వాలి. అప్పుసకాలంలో కట్టేటట్లు చూడాలి. అప్పు పొందటం కోసం ఎవ్వరికి డబ్బులివ్వకుండా చూడాలి.

గ్రామ/స్లమ్/మండల/పట్టణ సమాఖ్యల సమావేశాలలో స్త్రీనిధి అజెండా తప్పనిసరిగా పెట్టి చర్చించాలి. అదే విధంగా గ్రామ/స్లమ్/ సమాఖ్యల వద్ద ఉన్న టాబ్లెట్ పి.సి.లోని డి.సి.బి. రిపోర్టులో చూసుకొని ఏనెలకానెలా డిమాండ్ ప్రకారం సంఘాలు రుణాలు చెల్లించే విధంగా పర్యవేక్షించాలి. సంఘాల నుండి స్త్రీనిధి అప్పు వసూలు 100% కట్టించవలసిన బాధ్యత గ్రామ/స్లమ్/మండల/పట్టణ సమాఖ్యలదే. కొనుగోలు చేసినటువంటి స్థిర,చరాస్థులు లేదా మెటీరియల్ కొనుగోలు చేసిన బిల్లు కాపీలను పరిశీలించి మినిట్స్‌లో నమోదుచేసి భద్రపరచవలసి ఉంటుంది.

సంఘ సభ్యులు చేపట్టిన ఆస్తులను తనిఖీ చేసి ఆస్తులు కొనుగోలు చేయకపోతే వారిపై చర్యలు చేపట్టాలి మరియు అటువంటి రుణాలను తిరిగి స్త్రీనిధికి తక్షణమే వాపస్ చేయించాలి. లోన్ వాయిదా కట్టిన వెంటనే సంఘం నుండి సభ్యురాలికి రసీదు ఇవ్వాలి. రుణ వాయిదా చెల్లించిన వెంటనే సంఘం ఖాతానుండి స్త్రీనిధిఖాతాకు బదిలీ చేయాలి.

టాబ్లెట్ పి.సి గ్రామసంఘం/స్లమ్ సమాఖ్యల అధ్యక్షురాలి వద్ద ఉండాలి. మరియు అధ్యక్షురాలు లబ్ధిదారుల సమక్షంలోనే అప్పు దరఖాస్తు చేయాలి. ఒక సభ్యురాలికి బదులు ఇంకొక సభ్యురాలికి, ఒక కార్యక్రమానికి బదులు, ఇంకొక కార్యక్రమానికి ఎట్టి పరిస్థితిలోను అనుమతించరాదు.

**సమాఖ్యల లావాదేవీలలో పారదర్శకత:**

టాబ్లెట్ పి.సి ద్వారా గ్రామ/స్లమ్ సమాఖ్యలు స్త్రీనిధిలో రుణాలు పొందకోరే సభ్యుల నిర్ధారణ, ఆధార్ కార్డ్స్ ప్రామాణికంగా అత్యంత పారదర్శకంగా జరుగుతుంది. సభ్యులు/సంఘాలు పొందిన రుణాలు మరియు వారి పొదుపుల వివరాలు, సభ్యులు తిరిగి చెల్లించవలసిన మొత్తం మొదలగు రిపోర్టులు టాబ్లెట్ పి.సిలో పారదర్శకంగా అన్నివేళలలో అందుబాటులో ఉంటాయి. సంఘాలు/ సభ్యులు ప్రతినెల వాయిదా కట్టేముందు ఎంత కట్టాలో టాబ్లెట్ పి.సి ద్వారా నిర్ధారణ చేసుకోవచ్చు. వాయిదాలు కట్టిన తరువాత మెంబరు వారీగా లోను ఖాతాకు జమ చేసే వీలుంది. టాబ్లెట్ పి.సి.ల వినియోగంతో స్త్రీనిధి పనితీరులో పారదర్శకత మరింత పెరిగి ఇంకా సమర్థవంతమైన పనితీరును సాధించింది. ఇది సంఘ సమాఖ్యల నిర్వహణ మరియు వాటి పనితీరులో ఒక విప్లవాత్మకమైన మార్పు.

**సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్)**

సామాజిక తనిఖీలో అప్పు పొందిన సభ్యురాలి కుటుంబాలను సందర్శించి ఆస్తులను తనిఖీ చేసి స్త్రీనిధి నుంచి తీసుకున్న రుణాలు సక్రమంగా వినియోగం అవుతున్నాయా లేదా అనే విషయాన్ని చూస్తారు. పుస్తకాలు

ఏదీ అల్పమైనది కాదు, కానీ టన్ను శాస్త్రజ్ఞానం కన్నా ఔన్స్ అనుభవం గొప్పది

# కామంచి ఆకుతో ఆస్తమా దూరం !

**కా**మంచి మొక్క సమూలంగా ఔషధంగా ఉపయోగ పడుతుంది. దీనిని దగ్గు, ఆస్తమా, అల్సర్లు, కీళ్ళనొప్పులకు ఉపయోగిస్తారు. దీనిని అన్ని రకములు నేలల్లోనూ పండించవచ్చును. అన్ని రకాల వాతావరణములలోనూ పెరుగుతుంది. జూన్ - జులై నెలలు నాటేందుకు అనుకూలము. వర్షాధారంగా కూడా సాగు చేయవచ్చును.

**ప్రవర్ధనం :** విత్తనము ద్వారా వ్యాప్తి చేస్తారు.

**విత్తన మోతాదు :** ఎకరాకు 150–200 గ్రాములు.

**నారు పెంచుట మరియు నాటుట :** విత్తనము మే - జూన్ నెలల్లో నారు పోసుకోవాలి. 30 రోజుల వయస్సు ఉన్న నారును 60 × 60 సెం.మీ దూరంలో నాటుకోవాలి.

**ఎరువులు :** ఈ పంటకు ఎరువులు అంతగా అవసరం లేదు. ఆఖరి దుక్కిలో ఎకరాకు 4–5 టన్నుల పశువుల ఎరువును వేసుకోవాలి.

**అంతర కృషి :** తొలి దశలో అనగా నాటిన 30 రోజుల తరువాత మరియు 60 రోజులకొకసారి కలుపు తీయాలి.



**నీరు కట్టుట :** పంటకు అవసరమైనప్పుడు తగినంత నీటిని పూతకు వచ్చేవరకు కట్టాలి.

**కోత :** నాటిన 4–5 నెలల్లో ఈ పంట కోతకు సిద్ధమవుతుంది. పండ్లు లేత ఆకుపచ్చరంగు నుండి ముదురు ఆకుపచ్చ రంగుకు మారే దశలో పంటను కోసి నీడలో ఆరబెట్టాలి.

**దిగుబడి :** ఎకరాకు 200 నుండి 250 కిలోలు (ఎండిన తరువాత). ■

---

సరిగ్గా రాస్తున్నారా లేదా, లోన్ కార్డులు సంఘ సభ్యులకు మరియు సంఘాలకు లోన్లు అందినాయా మరియు లోను ప్రతాలు సరిగ్గా ఉన్నాయా లేదా, ఎక్కడ భద్రపరుస్తున్నారు అనేవి కూడా చూస్తారు. గ్రామసభ నిర్వహించి ఈ విషయా లను చర్చించి నివేదిక ఇస్తారు. నిధులు దుర్వినియోగం అయితే సంబంధిత వ్యక్తులపై చర్యలు ఉంటాయి.

**సురక్ష పథకం క్లెయిమ్ ప్రక్రియ**

ఈ పథకంలో అప్పు పొందిన సభ్యురాలు ఒకవేళ మరణించినట్లయితే మరణించిన తేది నాటికి మిగిలి ఉన్న అప్పునిల్వఆ సభ్యురాలి కుటుంబ సభ్యులకు లేదా సంఘానికి గాని భారం కాకుండా తద్వారా సంఘాలు విచ్ఛిన్నం కాకుండా చూస్తుంది. ఒక వెయ్యిరూపాయల లోనుకు రూ. 2.50 పైసల చొప్పున తీసుకున్న లోను మొత్తానికి ప్రీమియం చెల్లించాలి. ఇదిఅదనపు అప్పుగా ఇవ్వబడుతుంది.

**సురక్ష క్లెయిమ్ మంజూరు విధానము :** స్త్రీనిధి నుండి అప్పు పొందిన సభ్యురాలు చనిపోయినరోజే గ్రామ సంఘం టాబ్లెట్ పి.సి. లో చనిపోయిన సభ్యురాలి వివరాలు నమోదు చేయవలెను. సభ్యురాలు చనిపోయిన వారం లోపు క్లెయిమ్ డాక్యుమెంట్లు గ్రామ/స్లమ్ సమాఖ్య టాబ్లెట్ పి.సి.లో అప్ లోడ్ చేయవలెను. స్త్రీనిధి మేనేజర్ మరియు అసిస్టెంట్ మేనేజర్ వారి లాగిన్‌లో ఫీల్డ్ వెరిఫికేషన్ రిపోర్ట్ సబ్మిట్ చేస్తారు. ఈ రిపోర్టు మరియు క్లెయిమ్ డాక్యుమెంట్లు రెండు కరెక్ట్‌గా ఉంటే లోను ఖాతాకు అడ్జస్ట్ చేయగా మిగిలిన మొత్తాన్ని పేమెంట్ కొరకు సంఘం యొక్క బ్యాంక్ ఖాతాకు పంపుతారు. ఈ మొత్తాన్ని చనిపోయిన సభ్యురాలి వారసులకు అందజేస్తారు. ■

**విద్య బాల్యానికి మాత్రమే పరిమితం కాదు, నేర్చుకోవలసినవి నిరంతరం అనంతంగా వుంటూనే వుంటాయి**

# విలువ గొలుసు ... జీవనోపాధులు !

ఏపిమాస్ కొత్తగా ప్రారంభించిన 'పాలసీ చర్చ' చర్చావేదికలో భాగంగా 2020 డిసెంబర్ , 2021 జనవరి నెలలలో రెండు అంశాలపై పాలసీ చర్చ నిర్వహించడం జరిగింది. 2020 డిసెంబర్ 30 న 'ఎఫ్ పి ఓ లకు విలువ గొలుసు అభివృద్ధి' అనే అంశంపై ఐ సి టి అగ్రి, ఐటి బిజినెస్ శాఖాధ్యక్షుడు శ్రీ ఎస్. శివకుమార్ , 2021 జనవరి 4న 'ఆర్థికచేకూర్పు నుంచి జీవనోపాధుల దిశగా' అనే అంశంపై రాజీవ్ గాంధీ ఫౌండేషన్ సి ఇ ఓ శ్రీ విజయ్ మహాజన్ ప్రధాన విశ్లేషకులుగా పాలసీ చర్చ జరిగింది.

**ఎఫ్ పి ఓ లకు విలువ గొలుసు అభివృద్ధి**

ఏపిమాస్ 'సంస్థాగత వ్యూహ పత్రం 2030' రూపకల్పన ప్రక్రియలో భాగంగా, ఏపిమాస్ పనిచేసే వివిధ రంగాలపై విశ్లేషణాత్మకంగా చర్చించడానికి ఆ రంగాలలో విశేషానుభవం వున్న ప్రముఖులతో పాలసీ చర్చ నిర్వహించాలన్నది ఏపిమాస్ సంకల్పం. అందులో భాగంగా తొలివిడతగా శ్రీ ఎస్. శివకుమార్ 'ఎఫ్ పి ఓ లకు విలువ గొలుసు అభివృద్ధి' అనే అంశంపైన, భారతదేశంలో మారుతున్న పర్యావరణ పరిస్థితులలో ఎఫ్ పి ఓ లకు అవసరమైన వ్యూహాలు అనే అంశంపైనకూడా డిజిటల్ చర్చలో విశ్లేషించారు.

ప్రధాన చర్చ ప్రారంభానికి ముందుగా ఏపిమాస్ సి ఇ ఓ , ఎం డి శ్రీ సి ఎస్ రెడ్డి స్వాగతోపన్యాసంలో ఏపిమాస్ ఏఏ రంగాలలో పనిచేస్తున్నదీ, ఏఏ ప్రాజెక్టులను నిర్వహిస్తున్నదీ క్లుప్తంగా వివరించారు.


అనంతరం శ్రీ శివకుమార్ ఎఫ్ పి ఓ విలువ గొలుసునకు సంబంధించి మూడు విభిన్న నమూనాలను (మోడల్స్) గురించి తెలియజేశారు..అవి: విలువను సృష్టించే నమూనా, విలువను అందిపుచ్చుకునే నమూనా, విలువ గొలుసు క్లస్టర్ నమూనా అని ఆయన వివరించారు. ఈ మూడు నమూనాలను గురించి వివరిచడంతోపాటు ఒక్కో నమూనాలోని ఉపయోగాలు, ఎదురయ్యే సవాళ్ళను కూడా ఆయన వివరించారు.

**ఆర్థికచేకూర్పు నుంచి జీవనోపాధుల దిశగా ...**

ఏపిమాస్ 'సంస్థాగత వ్యూహ పత్రం 2030' రూపకల్పనపై విశ్లేషణాత్మక చర్చలో రెండవ విడతగా శ్రీ విజయ్ మహాజన్‌ను ఆహ్వానించడం జరిగింది. వచ్చే దశాబ్దంలో కొత్తగా కనీసం 12 కోట్ల జీవనోపాధులను సృష్టించవలసి వున్నదని శ్రీ విజయ్ మహాజన్ పేర్కొన్నారు. గ్రామీణులకు వారికి సమీపంలో జీవనోపాధులను ఏర్పాటుచేయడం పై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించవలసి వున్నదని ఆయన అన్నారు. మనదేశంలో వ్యవసాయంపై ఆధారపడిన 9 కోట్ల కుటుంబాలు, వ్యవసాయేతర ఉపాధులపై ఆధారపడిన 7 వేల కుటుంబాలు అసంఘటిత రంగంలో వున్నాయని, ఈ అసంఘటిత రంగంపై దృష్టి కేంద్రీకరించకుండా మనదేశం ఒక్కసారిగా అత్యున్నత సాంకేతిక దేశంగా మారజాలదని శ్రీ మహాజన్ పేర్కొన్నారు.

' జామ్ ' (జన్ ధన్ బ్యాంక్ ఖాతా, ఆధార్, మొబైల్) పేరుతో ప్రారంభించిన వ్యూహాన్ని మరి రెండు చేర్పులతో (ఆయుష్మాన్, ఆజీవిక) 'మాజా' గా రూపొందించడం అవసరమని ఆయన అన్నారు. విధాన రూపకర్తలు జన్‌ధన్‌తో దేశ జనాభాలో అధికశాతం మందిని బ్యాంకులతో అనుసంధానం చేయగలిగారని, సాంకేతిక వేదికలను కూడా జోడించారని, ఇక ఇప్పుడు ఆరోగ్య బీమా (ఆయుష్మాన్) , జీవనోపాధుల పెంపుదల (ఆజీవిక) పై ప్రధానంగా దృష్టిపెట్టవలసి వున్నదని శ్రీ మహాజన్ అభిప్రాయపడ్డారు. 'జామ్' ప్రయోగం విజయవంతమైనప్పటికి, ఈ అసంఘటిత రంగానికి రుణ సదుపాయ కల్పన ఇప్పటికీ ఆశించినంతగా ముందుకు సాగడంలేదని ఆయన పేర్కొన్నారు. ఆర్థిక చేకూర్పు రంగంలొ విశేషానుభవం గడించిన ఏపిమాస్ ఇక జీవనోపాధులపై కృషిచేయాలని శ్రీ మహాజన్ సూచించారు.

■



नाबार्ड
అభివృద్ధి
కోసం
పారిశుద్ధ్యం
నాబార్డు సౌజన్యంతో
చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి
స్వచ్ఛత ఉద్యమం
నీళ్ళ ట్యాంకు మరియు రెండు గుంతల మరుగుదొడ్డి
దీర్ఘ కాలం అందించెను మీకు సేవలు
गाँव बढ़े >> तो देश बढ़े
www.nabard.org
YouTube /nabardonline
Taking Rural India >>Forward

MAHILA SADHIKARATHA
Publication Date: 01-02-2021; Posting Date: 05 & 06-02-2021

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2021-23




మదనపల్లిలో 9 ఎఫ్ పి ఓ ల సి ఇ ఓలతో , ఆదిలాబాద్‌లో ధరణి ఎఫ్ పి ఓ ప్రతినిధులతో శ్రీ సి ఎస్ రెడ్డి సమావేశం




'ఇన్‌క్లూజివ్ ఫైనాన్స్ ఇండియా' సమ్మిట్ వెబినార్ లో శ్రీ సి ఎస్ ప్రసంగం







జనగావ్‌లో ఐదు ఎఫ్ పి ఓల డైరెక్టర్లకు శిక్షణ ... ములకనూర్, ధీశాలి ఎఫ్ పి ఓ డైరెక్టర్ల సమావేశాలు




నాబార్డ్ ఆధ్వర్యంలోని కడప, చిత్తూరు ఎఫ్ పి ఓల సి ఇ ఓలకు శిక్షణ ...




' పీస్ ' సంస్థ యాదాద్రి బృందం ధరణి ఎఫ్ పి ఓ కు అవగాహన పర్యటన దృశ్యం



మదనపల్లిలో ఎఫ్ ఎఫ్ ఎస్ బృందానికి శిక్షకులకు శిక్షణ





తెలంగాణా, గుజరాత్ మార్క్‌ఫెడ్‌ల సహకార ఒప్పందం ... ఆ సమావేశంలో ఏపిమాస్ అగ్రి మార్కెటింగ్ డైరెక్టర్ శ్రీమతి మధుమంజరికి సత్కారం ... పెయ్యలపాలెం ఆదర్శ గ్రామం వి డి సి చే ఏపిమాస్ పి ఓ శ్రీ భాస్కర్ దంపతులకు సన్మానం





కలికిరి,రామసముద్రం ఎఫ్ పి ఓ డైరెక్టర్ల సమావేశాలు .ఓ..పుంగనూరులో ఏపిమాస్, ఎఫ్ పి ఓల సిబ్బందికి జెండర్ వర్క్‌షాప్